సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 18.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 118
పేజీలు: 12 వెల: రూ. 5

# టీ20 వరల్డ్‌కప్‌లో భారీ షాక్

**వర్షం వల్ల జింబాబ్వే-ఐర్లాండ్ మ్యాచ్ రద్దు**

- వరుణుడి దెబ్బకు ఆసీస్ ఔట్.. జింబాబ్వే సూపర్ 8లోకి
- కెనడాను చిత్తు చేసి సూపర్ 8కు న్యూజిలాండ్
- నామమాత్రంగా మారిన స్కాట్లాండ్-నేపాల్ ఎలిమినేట్ మ్యాచ్

11



## రెండో రోజూ అదే తీరు

**కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఆందోళనతో దద్దరిల్లిన 'పుర'లు**

- తొర్రూరులో మాజీ మంత్రి ఎర్రబెల్లి అరెస్ట్, కంటతడి
- 11 మున్సిపాలిటీల్లో ఎనిమిదింటిలోనే ఎన్నిక
- 8 చోట్ల ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక పూర్తి
- ఏడు పుర పీఠాలు కాంగ్రెస్ కైవసం
- బీఆర్ఎస్ ఖాతాలో ఇద్దేశం మున్సిపాలిటీ
- కోరంలేక ఖానాపూర్‌లో.. క్యాతనపల్లిలో ఘర్షణతో వాయిదా
- ఇబ్రహీంపట్నం ఎన్నికపై హైకోర్టు స్టే

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మున్సిపాలిటీల్లోని ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికలు రణరంగాన్ని తలపించాయి. ఈ నెల 16న వివిధ కారణాలతో వాయిదా పడిన మున్సిపాలిటీల్లో ఎన్నికకు అధికారులు మంగళవారం ఉదయం ఏర్పాటు చేశారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు సర్వశక్తులొడ్డాయి. పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఆందోళనకు దిగాయి. వారి ఆందోళనల మధ్య అధికారులు ఎనిమిది చోట్ల ఎన్నికలు పూర్తి చేశారు. వీటిలో ఏడు పుర మిగతా 02లో

## బస్సులోనే బరితెగింపు

**స్లీపర్‌ను 'ఓయో'గా మార్చాలని ప్లాన్**



- ప్రైవేట్ బస్సులో ప్రేమ జంట హంగామా.. డ్రైవర్‌పై దాడి
- ఫిమేల్ కోటాలో టికెట్ బుక్ చేసి మోసం.. బయటపడ్డ వెంటనే హింస
- ప్రియుడిని రెచ్చగొట్టి దాడిచేయించింది.. చిలకలపూడిలో ఉద్రిక్తత

09




# ప్రజా తీర్పునకు పంగనామం

## కుర్చీ కోసమే కుయుక్తుల మైత్రి!

- పొత్తుల రాజకీయాలు పీక్స్‌కు.. సిద్ధాంతాలకు పాతాళం
- అధికారమే లక్ష్యం.. ప్రజా తీర్పుకు అవమానం
- మున్సిపల్ ఎన్నికల్లో ఊసరవెల్లి రాజకీయాలు
- ప్రత్యర్థులు మిత్రులు.. పదవుల కోసం ఏకమైపోయిన పార్టీలు
- ఓటరు తీర్పు తుంగలో తొక్కిన పొత్తుల గేమ్
- సిద్ధాంతాలకి వీడ్కోలు.. అధికారానికి మైత్రి కూటములు
- పార్టీల కూటములు.. కార్యకర్తల్లో అసంతృప్తి
- స్థానిక సంస్థల్లో అధికార పోరు.. ఓటర్లకు న్యాయం ఎప్పుడు?

**ముద్ర డెస్క్ :** సిద్ధాంతాలు మంటగలిశాయి.. విలువల వలువలు ఊడాయి! నిన్నటి వరకు కత్తులు దూసుకున్న పార్టీలు, నేడు పదవీ పీఠం కోసం 'పవిత్ర' బాంధవ్యాలు కలుపుతున్నాయి. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఓటరు నాడిని పట్టుకుంటే, ఆ తర్వాత జరిగిన పరిణామాలు మాత్రం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయి. గెలిపించిన ప్రజల తీర్పును తుంగలో తొక్కి, నైతికతను పాతాళానికి తొక్కి.. కేవలం అధికారం దక్కించుకోవడమే పరమావధిగా సాగుతున్న ఈ 'ఊసరవెల్లి రాజకీయాల'పై ఒక ప్రత్యేక విశ్లేషణ.

రాజకీయాలు అంటేనే కంపు, మురికి కూపం అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. ఒకప్పుడు పార్టీలకు సిద్ధాంతాలు ఉండేవి. నేతలు, కార్యకర్తలు విలువలకు కట్టుబడి పనిచేసేవారు. కానీ ప్రస్తుత ధనస్వామ్యంలో అధికారమే పరమావధిగా మారింది. పార్టీలు నిరుద్యోగుల ఆశ్రయ కేంద్రాలుగా మారాయి. దీంతో పదవులు దక్కించుకోవడానికి ఇష్టానుసారం పార్టీలు మారుతున్నారు. ఇక పార్టీలు కూడా సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చి.. పొత్తులు పెట్టుకుంటున్నాయి. తాజాగా తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల వ్యవహారం చూస్తే.. ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. అధికారం కోసం బీఆర్ఎస్–బీజేపీ, కాంగ్రెస్–ఎంఐఎం, బీజేపీ–కాంగ్రెస్, బీఆర్ఎస్–కాంగ్రెస్–ఎంఐఎం, బీఆర్ఎస్–సీపీఐ, కాంగ్రెస్ – సీపీఐ ఇలా ఇష్టానుసారంగా పొత్తులు –పెట్టుకున్నాయి. ప్రజల తీర్పును అపహాస్యం చేశాయి.

**పొత్తుల రాజకీయం ఇలా..**

ఎన్నికల తర్వాత అనేక మున్సిపాలిటీల్లో ప్రత్యర్థి పార్టీలు కలిసి మేయర్, చైర్మన్ పదవుల కోసం పొత్తుల రాజకీయాలకు తెరతీశాయి. కాంగ్రెస్–బీఆర్ఎస్, బీఆర్ఎస్–బీజేపీ కలయికలు, కొన్ని చోట్ల మూడు పార్టీల కూటమి కూడా కనిపించాయి. ఇలాంటి దగ్గరి ఒప్పందాలు పార్టీ కార్యకర్తల్లో కూడా విభేదాలు సృష్టించాయి.

**ప్రజాస్వామ్యం అపహాస్యం..**

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. ఈమేరకు తెలంగాణ పట్టణ ఓటర్లు ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ ఇచ్చారు. కానీ, మ్యాజిక్ ఫిగర్ రాలేదన్న భావనతో అక్రమ పొత్తులకు మిగతా 02లో

## మాతో కలిసి రావాలి

**3వ బయోఏషియా అంతర్జాతీయ సదస్సులో సీఎం రేవంత్**



- జీవవైజ్ఞానిక రాజధాని కోసం కదిలిరండి
- హైదరాబాద్‌ను సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదాం
- ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ
- ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా భాగ్యనగరం

02

## డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

**భూ పరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి: సీఎం రేవంత్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** డాటా సెంటర్లకు వివిధ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు.. వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. డాటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలని మిగతా 02లో

## ఐబొమ్మ రవికి బెయిల్



- షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన హైకోర్టు
- వంద రోజుల తర్వాత విడుదల బయటికి రవి

03

## చెత్త కనబడితే వేటే

**స్పాట్ లోనే సస్పెండ్ చేస్తా**

**నగరంలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి**

**పురపాలక శాఖ సమీక్షలో సీఎం రేవంత్**

- విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించం
- ప్రకటనల ఆదాయం పెంపుపై కసరత్తు చేయాలి
- మల్టీలెవల్ పార్కింగ్.. స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయండి
- నూతన మేయర్లు.. డిప్యూటీ మేయర్లు.. ఛైర్మన్లు.. డిప్యూటీ ఛైర్మన్లతో త్వరలో సమావేశం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** నగరంలో ఉన్న మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి జోన్‌లో తాను ప్రత్యక్ష పరిశీలనకు వస్తానని చెప్పారు. ఎక్కడైనా చెత్త కనపడితే సహించబోనన్న సీఎం.. స్పాట్ లోనే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు మిగతా 02లో

## పల్లెల అభివృద్ధికి రూ. 250 కోట్లు

**గ్రామాల మౌలిక వసతుల అభివృద్ధికి భారీ కేటాయింపు**

- పంచాయతీలకు నిధుల విడుదలతో వేగం పుంజుకోనున్న పనులు
- తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం
- కేంద్ర-రాష్ట్ర నిధులతో గ్రామాభివృద్ధికి కొత్త ఊపు
- 15వ ఆర్థిక సంఘం నిధులతో మరింత బలపడనున్న పల్లెలు

03



## మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

**ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకే**

- ఉర్దూ మీడియం పాఠశాలల నిర్వహణలో మార్పులు
- రంజాన్ సందర్భంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు స్కూళ్లు

03



## భూమిపై తొలి శాకాహారి

**30 కోట్ల ఏళ్ల నాటి జీవి శిలాజం**



- కెనడాలో లభించిన శిలాజం భూమి పరిణామ చరిత్రలో కొత్త అధ్యాయం
- 307 మిలియన్ సంవత్సరాల క్రితమే శాకాహార జీవుల ఆవిర్భావం
- సీటీస్కాన్‌లతో ఆహారపు అలవాట్లు నిర్ధారించిన శాస్త్రవేత్తలు

09



## రెండేళ్లలో ఆఫీస్ ఉద్యోగాలు ఉండవు..

10

- రోజులు పట్టే విశ్లేషణలు నిమిషాల్లోనే
- ఐటీ సేవల నుంచి ఏఐ ఉత్పత్తుల దిశగా మారాల్సిన అవసరం
- ఏఐతో కలిసి పనిచేస్తేనే భవిష్యత్

## 9 మంది పాస్.. ఒక్కరు ఫెయిల్!

**మున్సిపల్ పోరులో 'మహబూబ్ నగర్' ఎమ్మెల్యేల జోరు**

- నారాయణ పేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి ఒక్కరే ఫేయిల్
- 8 మంది కాంగ్రెస్, ఒక్క బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే సక్సెస్
- ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీ లలో సఫలమైన మంత్రులు, ఎమ్మెల్యేలు

10

- జిల్లా లో ఒకే ఒక మేయర్ పదవి దక్కించుకోవడంలో ఎమ్మెల్యే యెన్నం సక్సెస్ మంత్రం



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 10 నియోజకవరాల పరిధిలో జరిగిన ఎన్నికల సమరంలో 9 మంది ఎమ్మెల్యేలు తమ అభ్యర్థులను గెలిపించుకొని 'సక్సెస్' మార్కులు సాధించగా, నారాయణ పేటలో మాత్రం కాంగ్రెస్ పరాజయం పాలైంది. మంత్రులు జూపలి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తమ వ్యూహాలతో క్లీన్ స్వీప్ చేయగా, మహబూబ్ నగర్ మేయర్ పీఠాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడి తన ఖాతాలో వేసుకున్నారు. నారాయణ పేటలో బీజేపీ జెండా ఎగరడం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 18.02.2026
www.mudranews.in | @mudranews



### టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS)




భారతదేశంలోనే అతిపెద్ద ఐటీ సంస్థగా ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తోంది. బ్యాంకింగ్, హెల్త్‌కేర్, క్లౌడ్, AI రంగాల్లో బలమైన స్థానం కలిగి ఉంది.



# చెత్తకనబడితే వేటే

(మొదటి పేజీ తరువాయి)
చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై సీఎం... రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై ఆరా తీశారు. ఆదాయం పెంపునకు తీసుకోవాల్సిన పలు అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు.

ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్‌ల్లోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు, సలహాలు అందజేశారు. మూడు నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ సిస్టమ్ అనుసరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలోని పార్కుల వివరాలు సేకరించాలని.. వాటి అభివృద్ధిపైన ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు.

**మేయర్లు, డిప్యూటీ మేయర్లు.. చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లకు శిక్షణ**

రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు.. చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లతో త్వరలోనే ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు.. ఇతర అంశాలను వివరించాలని సూచించారు. తాను సమావేశానికి హాజరై నూతనంగా ఎన్నికైన వారితో మాట్లాడాతానని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా తీర్పునకు పంగనామం

(మొదటి పేజీ తరువాయి)
తెరతీశాయి. పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రజల తీర్పును అగౌరవపరుస్తూ అధికారం చేజిక్కించుకుంటున్నాయి.

**ప్రత్యక్ష ఎన్నికలు ఉంటే..**

అక్రమంగా పొత్తులు పెట్టుకున్నాక ఇక ఎన్నికలు ఎందుకు.. ప్రజాస్వామ్యానికి విలువ ఎక్కడ ఉంటుంది. ప్రత్యక్ష స్థానిక సంస్థల అధిపతులకు ప్రత్యక్ష ఎన్నికలే ఉండాలి. సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షుల వరకు ప్రత్యక్ష ఎన్నికలే జరగాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుంది. లేదంటే పరిస్థితి ఇంతకన్నా దారుణంగా మారుతుంది. భవిష్యత్ అంధకారం అవుతుంది. దీనిని ఎలా సరిదిద్దాలి అనేది ఆలోచించుకోవాలి. సరిదిద్దే మార్గాలు అన్వేషించాలి. ప్రజాస్వామ్యాన్ని తిరిగి గాడిన పెట్టే బాధ్యత ఓటర్లపైనే ఉంది. 75 ఏళ్ల చరిత్రలే అసాధ్యం అనుకున్నవి సుసాధ్యం అయ్యాయి. చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజాస్వామ్యం నిలబడుతుంది.

**పాలనా సంస్కరణలు..**

పాలనా సంస్కరణలు తీసుకురావాలని చాలా మంది ప్రజాస్వామికవాదులు కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి పదవికి కూడా ప్రత్యక్ష ఎన్నికలు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. అవి ఇప్పట్లో జరగకపోవచ్చు. కానీ స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు. అందుకే స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి. పార్టీ సిద్ధాంతాలు లేవన్న విషయం తాజా మున్సిపల్ ఎన్నికల పొత్తుల ద్వారా అర్థమైంది. కరెక్ట్ ఎన్నికలు జరిగితే ఈ ధనస్వామ్య సిస్టం మారుతుంది. ఎక్స్ అఫీషియోలకు ఓటు ఎందుకు. స్థానిక సంస్థల్లో రోల్ ఉండడం తప్పు కాదు. కానీ ఓటు ఎందుకు అన్నది సమాధానం లేని ప్రశ్న. నేరుగా ఎన్నికలు నిర్వహించేలా రాజ్యాంగ సవరణ చేయాలి.

మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు కలిసి ప్రజా తీర్పును అపహాస్యం చేశాయి. అధికారం కోసం అడ్డదారులు తొక్కాయి. స్థానిక సంస్థల్లో బలంగా ఉంటే భవిష్యత్‌లో మళ్లీ గెలుస్తామన్న నమ్మకంతో పార్టీలు ఓటరు తీర్పును తుంగలో తొక్కేశారు.

# డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

(మొదటి పేజీ తరువాయి)
చెప్పారు. వివిధ ప్రాంతాల్లో డాటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సాగుతున్న భూ సేకరణ పైనా సీఎం ఆరా తీశారు. భూ పరిహారం నిర్ణయం విషయం లో ఉదారంగా ఉండాలని అధికారులకు సూచించారు. రైతులను పిలిచి మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాలన్నారు. రూ. వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టె పెట్టుబడి చాలా స్వల్పమన్నారు. కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక పాల్గొన్నారు.



# కబ్జాలకు తోడు.. 'ఫైర్' ఫిర్యాదులు

## హైడ్రా ప్రజావాణికి 59 వినతులు

**ముద్ర, హైదరాబాద్:** నగరంలో కబ్జాలు మాత్రమే కాకుండా అగ్నిప్రమాదాలకు దారి తీసే పరిస్థితులపై కూడా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే హైడ్రా ప్రజావాణిలో ఈ సారి మొత్తం 59 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి ప్రాంతంలో రహదారి విస్తరణ పనుల్లో సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల వరద ముప్పు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణ దశలోనే సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే సమయంలో ప్రభుత్వ భూముల కబ్జాలపై కూడా పలు ఫిర్యాదులు వచ్చాయి. సంగారెడ్డి జిల్లా శ్రీనివాసనగర్‌లో ప్రజా అవసరాల కోసం ఉన్న స్థలాలను ఆక్రమిస్తున్నారని, అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొండాపూర్‌లో పార్కులు, రహదారులు, పాఠశాల స్థలాలు సహా అనేక ప్రాంతాలు ఆక్రమణకు గురవుతున్నాయని నివాసితులు ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకుని ప్రజా భద్రతను కాపాడాలని హైడ్రాను ప్రజలు కోరుతున్నారు.

# రెండో రోజూ అదే తీరు

(మొదటి పేజీ తరువాయి)
పీఠాలపై కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. దీంతో ఈ నెల 16న 81 స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్ ఖాతాలో మరో ఏడు మున్సిపాలిటీలు చేరగా.. వాటి సంఖ్య 88కి చేరింది. ఇద్రేశం మున్సిపాలిటీని ప్రతిపక్ష బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. ఖానాపూర్‌లో కోరంలేక ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. క్యాతనపల్లిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతుదారుల ఆందోళనతో వాయిదా పడింది. కాగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఎస్ఈసీ వాయిదా వేసింది. ఎన్నికపై హైకోర్టు నుంచి స్టే రావడంతో

**ఏ మున్సిపాలిటీ ఎవరి ఖాతాలోకి**

| మున్సిపాలిటీ | పార్టీ |
|---|---|
| ఇల్లందు | కాంగ్రెస్ |
| కాగజ్ నగర్ | కాంగ్రెస్ |
| డోర్నకల్ | కాంగ్రెస్ |
| తొర్రూర్ | కాంగ్రెస్ |
| సుల్తానాబాద్ | కాంగ్రెస్ |
| జహీరాబాద్ | కాంగ్రెస్ |
| జనగామ | కాంగ్రెస్ |
| ఇద్రేశం | బీఆర్ఎస్ |

అధికారులు వాయిదా వేశారు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కౌన్సిలర్ యాదగిరి కుమారుడు కిడ్నాప్‌పై హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఎల్లుండిలోపు యాదగిరిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించింది. అనూహ్యంగా ఉదయం బీఆర్ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు యాదగిరి హాజరయ్యారు. చైర్మన్ ఎన్నిక పూర్తయిన తర్వాత అధికారులకు కోర్టు ఆదేశాలు అందాయి. స్టే కారణంగా బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థికి ధ్రువీకరణపత్రం ఇవ్వలేదు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశాయి.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక అత్యంత రసవత్తరంగా సాగింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటింగ్ ప్రక్రియ ను ప్రారంభించిన అధికారులు.. చేతులెత్తి చైర్మన్‌ను ఎన్నుకోవాలని సూచించారు. దీనికి కాంగ్రెస్ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రహస్యంగా ఓటింగ్ నిర్వహించాలని గొడవకు దిగారు. ఎన్నికల నియమావళి ప్రకారమే ఓటింగ్ జరగాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఉద్రిక్తత పెరిగి కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కౌన్సిలర్లపై దాడులకు దిగారు. మున్సిపల్ కార్యాలయం వద్ద తోపులాట జరగడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఇరు పార్టీల మధ్య ఘర్షణలు జరుగుతున్నప్పటికీ, రిటర్నింగ్ అధికారి పట్టుదలతో ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమే జరిగిన ఓటింగ్‌లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోగా.. 3వ వార్డు మెంబర్ టేకుల సుదర్శన్ రెడ్డి 15 ఓట్లతో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేశారు. ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడిన పరిస్థితుల్లో కూడా వ్యూహాత్మకంగా వ్యవహరించి బీఆర్ఎస్ ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.

తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య తన ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకోవడానికి అక్కడికి చేరుకున్నారు. అయితే ఇప్పటికే వరంగల్‌లో వినియోగించుకున్నప్పటికీ, తొర్రూరులో ఎక్స్‌అఫిషియో ఓటును ఎలా వినియోగిస్తారని ప్రశ్నిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు నిరసనకు దిగారు. నిరసన నేపథ్యంలో పోలీసులు దయాకర్ రావును అదుపులోకి తీసుకుని నరసింహారావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో నర్సింహులపేట వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ఎత్తున పోలీసుల వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరుగగా.. చివరకు దయాకర్ రావును నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తొర్రూరులో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతుండగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

**ఏడు మున్సిపాలిటీలు హస్తగతం**

ఇల్లందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోగా దొడ్డ కిరణ్‌మిత్ర చైర్మన్‌గా, పెండేల రాజు వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీజేపీ మద్దతుతో హస్తం పార్టీ దక్కించుకుంది. అక్కడ చైర్ పర్సన్‌గా కాంగ్రెస్ చెందిన షాహీన్ సుల్తానా ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్‌గా కొండేటి రాజకుమారి, వైస్ చైర్ పర్సన్‌గా మాద లావణ్యను ఎన్నికున్నారు. జనగామ, తొర్రూర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ఉత్కంఠ మధ్య జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రెండుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బలాబలాలు సమానంగా ఉన్నాయి. దీంతో అధికారులు లాటరీ తీశారు. లాటరీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్ అభ్యర్థుల పేర్లు రావడంతో ఆ రెండు మున్సిపాలిటీలూ కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. సుల్తానాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ చైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు. జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. చైర్మన్‌గా యూనుస్ ఎన్నికయ్యారు. ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎంపీ సురేష్ షెట్కార్ ఓటు వేశారు. ఇంద్రేశం మున్సిపాలిటీని బీఆర్ఎస్ దక్కించుకుంది. చైర్‌పర్సన్‌గా ప్రమీల, వైస్ చైర్మన్‌గా హరీశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

**క్యాతన్ పల్లి, నిర్మల్ లో వాయిదా**

క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక వాయిదా మళ్లీ పడింది. ఇరువర్గాల గొడవతో ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ ఎన్నిక వాయిదా వేశారు. కోరం వచ్చినా అధికారులు ఎన్నిక నిర్వహించలేదు. ఎన్నిక చేపట్టాలని బీఆర్ఎస్, సీపీఐ సభ్యులు డిమాండ్ చేశారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ పార్టీ అభ్యర్థులతో కలిసి బయటకు వెళ్లారు. ఎన్నికల గదిలో బీఆర్ఎస్ సభ్యులు తమపై దురుసుగా ప్రవర్తించారని వివేక్ ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రమాణ స్వీకారం తర్వాత అధికారులు కావాలని పది నిమిషాలు విరామం ఇచ్చారని, తమని కిడ్నాప్ చేయాలని కాంగ్రెస్ పథకం వేసిందని ఆరోపించారు. ఎన్నిక జరిగే సమావేశం మంత్రి వివేక్ ప్రసంగించడానికి అధికారులు అవకాశం ఇచ్చారని, బీఆర్ఎస్, సీపీఐ బలాన్ని చూసి వివేక్ జీర్ణించుకోలేక పోయారని విమర్శించారు. సజావుగా జరపాల్సిన ఎన్నికలను ఉద్దేశ్యపూర్వకంగానే వాయిదా వేశారని అన్నారు. అలాగే కోరం లేకపోవడంతో నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోనూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు రెండో రోజు వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు

**ఎర్రబెల్లి కన్నీళ్లు..**

తొర్రూర్ మున్సిపాలిటీ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఉద్రిక్తత తలెత్తడంతో దయాకర్ రావును నర్సింహుల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తానేం సమాధానం చెప్పాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పని చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు



# మాతో కలిసి రావాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** వ్యాక్సిన్ తయారీలో ప్రపంచ రాజధానిగా ఉన్న హైదరాబాద్ జీవవైజ్ఞానిక రాజధానిగా ఎదగడంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రపంచ దిగ్గజ కంపెనీలు, శాస్త్రవేత్తలు, నిపుణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ... దేశంలోని మిగతా రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతోందన్న ఆయన ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా మారిందని వెల్లడించారు. అలాంటి హైదరాబాద్‌ను అందరం కలిసి సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ హైటెక్స్‌లో 23వ బయో ఏషియా అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రధానంగా 'టెక్‌బయో అన్‌లీష్ – ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రపంచస్థాయి సదస్సులో మాట్లాడిన సీఎం.. తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. "ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుంచి ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతుంది. అందుకు తెలంగాణ ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది. ఈ ఎదుగుదలలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జీవవైజ్ఞానిక రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆధునిక మార్పులను గమనిస్తే, పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం ఉంది. ఆయా సంస్థలు, కార్పొరేట్లు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ఆ వాతావరణాన్ని తెలంగాణ అందిస్తుందన్నారు. అందుకు హైదరాబాద్ అనుకూలమైందని చెప్పారు. బల్క్‌డ్రగ్స్ నుంచి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచస్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందని వివరించారు. తెలంగాణలో ఉన్న వనరులు, అనుకూల పరిస్థితుల దృష్ట్యా ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని కోరారు. జీసీసీలను స్థాపింపి.. ఆవిష్కరణ కేంద్రాలు నిర్మించాలన్నారు. మాలిక్యూల్స్ , ఔషధాలను డిజైన్, క్లినికల్ అనలిటిక్స్‌ను ప్రారంభించామన్నారు. ఏఐ ప్లాట్‌ఫామ్‌లను, డిజిటల్ తయారీ రంగాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అందుకు ప్రభుత్వం, యంత్రాంగం, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయంలో భాగస్వాములుగా ఉంటారని సీఎం హామీ ఇచ్చారు. 23 ఏళ్ల క్రితం బయోఏషియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్ వేర్ నగరంగా గుర్తింపు ఉండేదని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి... ఇప్పుడు హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా కూడా నిలిచిందని హర్షించారు. దూరదృష్టి కలిగిన నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు ఉండటంతో హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు, పరిశోధన, డిజైన్ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా ఎదిగిందని చెప్పారు.

**జీవవిజ్ఞాన రంగంలో రూ. 73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు**

గడిచిన రెండేళ్లలో తెలంగాణలో జీవవిజ్ఞాన రంగంలో రూ. 73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని సీఎం తెలిపారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా తెలంగాణ నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామన్న ఆయన. జినోమ్ వ్యాలీని విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు ప్రపంచ స్థాయి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం వన్–బయోను ప్రారంభించామన్నారు. ఇటీవలే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ఆవిష్కరించామనీ 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నది మా లక్ష్యమన్నారు.




**గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధి వేగవంతం**

తెలంగాణలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేసినట్లు సీఎం వెల్లడించారు. అందులో భాగంగా బలమైన సంకల్పంతో ఇప్పటికే అనేక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆహ్వానించినట్లు చెప్పారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే బయోఏషియా–2026 సదస్సు అని సీఎం వివరించారు. ఇప్పుడు బయోఏషియా తన పరిధిని విస్తరించుకుని "బయోవరల్డ్"గా మారుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలు, దాదాపు 4 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరుకావడం అభినందనీయమన్నారు. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, హెల్త్‌కేర్ రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. హైదరాబాద్ లో లో జరుగుతున్న ఈ బయో ఏషియా సదస్సు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదికలాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న విశ్వాసం తనకుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ నలుమూలల నుంచి బయోఏషియా సదస్సుకు హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్ కు జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు–2026 అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
18.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**భారతదేశంలోని ప్రముఖ టాప్ 2 ఐటీ కంపెనీ**

ఇన్ఫోసిస్ (Infosys) : గ్లోబల్ స్థాయిలో కన్సల్టింగ్, టెక్నాలజీ సేవల్లో ప్రసిద్ధి. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, AI, క్లౌడ్ సొల్యూషన్స్‌లో ముందుంది.







## మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎత్తివేత

- పూర్తయిన మున్సిపల్ ఎన్నిక ప్రక్రియ
- ఎన్నికల సంఘం ప్రకటన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తవడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. ఎన్నికల ఫలితాలు వెలువడి, పాలక వర్గాల ఎన్నిక కూడా ముగియడంతో ఎన్నికల నియమావళి తక్షణమే రద్దవుతున్నట్లు ఎన్నికల అధికారులు మంగళవారం ప్రకటించారు. గత నెల 27న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమలులో ఉన్న సమయంలో కొత్త పథకాల ప్రకటనలు, బదిలీలు, ప్రభుత్వ ప్రచారాల పై ఆంక్షలు కొనసాగాయి. ఇప్పుడు కోడ్ ఎత్తివేయడం తో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పరిపాలనా పరమైన నిర్ణయాలు, బదిలీల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానున్నాయి. మరోవైపు ఎన్నికల కోడ్ ముగియడంతో అటు అధికార యంత్రాంగం, ఇటు రాజకీయ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, చైర్మన్లు తమ తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించి, అభివృద్ధి పనులపై దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా హంగ్ ఏర్పడి ఉత్కంఠ రేపిన మున్సిపాలిటీలలో కూడా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.

## మున్సిపల్ లో బీజేపీ ఎక్కడ..?

- కమ్యూనిస్టులు పరాన్న జీవులు కాదు..
- ప్రపంచంలో కమ్యూనిజానికి ఫుల్ స్టాప్ లేదు
- బీఆర్ఎస్ మద్దతును మేం తిరస్కరించలేదు
- జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో జత కట్టామనే మద్దతు తీసుకోలేదు
- మీడియాతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కమ్యూనిస్టులు పరాన్న జీవులు, ఎక్కడా ఉన్నారని ప్రశ్నించిన బీజేపీ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కడ ఉంది? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. వామపక్ష భావాజాలాన్ని చులకనగా చేసి... మాట్లాడిన కాషాయ పార్టీ కొత్తగూడెంలో ఎక్కడ ఉందని చురకలంటించారు. పట్టణాల్లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ 41 స్థానాల్లో విజయం సాధించిన విషయాన్ని బీజేపీ ఇప్పటికైనా గమనించాలన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన కమ్యూనిజానికి ఫుల్ స్టాప్ ఉండదని స్పష్టం చేశారు. కమ్యూనిజం అనేక దేశాల్లో చిగురిస్తుందని జోస్యం చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కూనంనేని మీడియాతో మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ తొలిసారి సీపీఐకి రావడంపై హర్షం వ్యక్తం చేసిన ఆయన బీజేపీపై మండిపడ్డారు. కొత్తగూడెం మేయర్, డిప్యూటీ మేయర్‌కు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ సీపీఐకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిందని తెలిపారు. అయితే బీఆర్ఎస్ మద్దతును తాము తిరస్కరించలేదని చెప్పారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో జత కట్టామన్న కూనంనేని.. ఆ కారణంతోనే బీఆర్ఎస్ మద్దతు తీసుకోలేకపోయామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఉండాలని జాతీయ స్థాయిలో ఉందన్నారు. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం సీపీఐ ఒంటరిగా పోటీ చేసిందని తెలిపారు. సీపీఎం కొన్ని చోట్ల కాంగ్రెస్, మరికొన్ని చోట్ల బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుందని వెల్లడించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో మాకు బలం ఉన్న చోట్ల సీట్లు కాంగ్రెస్‌ను అడుగుతామని కూనంనేని అన్నారు. ఒకవేళ ఇవ్వకపోతే ఒంటరిగా పోటీ చేస్తామని చెప్పుకొచ్చారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ ఒంటరిగా పోటీ చేసిందని గుర్తుకుచేశారు. భవిష్యత్తులో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కనీసం ప్రాతినిధ్యం ఉండేలా నైనా కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్, సీపీఐ మిత్రపక్షాలు అని చెప్పుకుంటున్నా.. ఎన్నికలు వస్తే పొత్తు కుదరడం లేదన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో నైనా ఆ తప్పిదాలు జరగకుండా కాంగ్రెస్ చూడాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎర్ర చొక్కా వేసుకున్న వ్యక్తిని పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఇది పోలీసు రాజ్యమా? అని ప్రశ్నించారు. కొత్తగూడెంలో పోటీ నుంచి తప్పుకోవాలని ఒక సీఐ సీపీఐ అభ్యర్థికి తుపాకీ గురి పెట్టారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినప్పటికీ ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఊరుకోం అని హెచ్చరించారు. కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం కార్పొరేషన్‌కు తొలి మేయర్ సీపీఐ కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని కూనంనేని వెల్లడించారు. యువకుడు, సామాన్య ఆటో డ్రైవర్‌ను కొత్తగూడెం మేయర్‌ను చేశామని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో చతుర్ముఖ పోటీ జరిగిందన్న ఆయన.. సీపీఐ కొత్తగూడెంలో ఒంటరిగా పోటీ చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో సీపీఐ 22 కార్పొరేటర్లను గెలవగా, సీపీఐ మద్దతు ఇచ్చిన ఒక ఇండిపెండెట్ విజయం సాధించారని చెప్పారు.

## పల్లె అభివృద్ధికి రూ.250 కోట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ
- మౌలిక సదుపాయాలకు ఖర్చు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ. 250 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, రహదారుల మెరుగుదల వంటి పనులకు ఈ నిధులు వెచ్చించాలని ఆదేశించింది. ఈ మేరకు ఆలర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు.. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా రెండో విడతగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ. 387 కోట్లు తెలంగాణకు విడుదల చేసింది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు వెచ్చించాలని సూచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. అయితే 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి సుమారు రూ. 3000 కోట్లు రావాల్సి ఉంది.

# పగబట్టినట్టే..





ఎవరో ఉసిగొలిపినట్టు.. ఎయిర్ పోర్ట్ లోనూ.. రైల్వే స్టేషన్ లోనో.. బస్టాండ్ లోనో.. ఓ ప్రమాదకరమైన ఉగ్రవాదిని, లేదా దొంగని పోలీస్ జాగిలం దాడి చేసి పట్టినట్టుగా.. తన ఇంటి ముందు ఫోన్ మాట్లాడుకుంటూ నిల్చున్న మహిళపై ఒక్కసారిగా దాడి చేసింది. అసలు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే ఆ కుక్క ఆమెను కిందపడేసి రెండు మూడు చోట్ల గాయపర్చింది. సమీపంలోనే ఉన్నవాళ్లు పరిగెత్తుకురావడంతో ఆ కుక్క అక్కడి నుంచి పరారైంది. ఈ ఘటనకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

- ఒక్కసారిగా విరుచుకుపడిన వీధి కుక్క
- స్థానికులు రావడంతో పరారైన సునకం
- స్వల్పగాయాలతో బయటపడిన మహిళ
- కుక్కల స్వైర విహారంతో బయపడిపోతున్న జనం

**ముద్ర, తెలంగాణ:**

మనదేశంలో ఊర కుక్కల బెడద కొంతకాలంగా ఉంది. ఏకంగా సుప్రీంకోర్టు కూడా ఈ విషయంపై స్పందించింది. ఊర కుక్కల సంతతి పెరగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు ఊర కుక్కలు దాడి చేసినప్పుడు.. బాధితులకు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వాలని.. ఆ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని అనేక సందర్భాలలో సూచించింది. కొన్ని ప్రాంతాల్లో ఊర కుక్కలను నిర్మూలించడానికి పాలకవర్గాలు సంహారం అనే కార్యక్రమాన్ని చేపడుతూ ఉంటాయి. ఈ సంఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు జంతు ప్రేమికులు ఆందోళనలు చేస్తూ ఉంటారు. ఊర కుక్కలను అభిమానించేవారు ఆందోళనలు చేపడుతూ ఉంటారు. వాస్తవానికి ఆ ఊర కుక్కలు మీద పడి దాడి చేస్తే అప్పుడు వారికి తెలుస్తుంది. ఊర కుక్కలు తీవ్రమైన ప్రవర్తనతో ఉంటాయి. వాటి లాలాజలంలో రేబిస్ వైరస్ ఉంటుంది. రేబిస్ వైరస్ ప్రాణాంతకమైనది. సకాలంలో వైరస్ నివారణకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేసుకోకపోతే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అందువల్లే ఊర కుక్కలు దాడి చేసినప్పుడు జాగ్రత్తగా ఉండాలి. రేబిస్ వ్యాక్సిన్ వేసుకోవాలి. రేబిస్ వ్యాక్సిన్ వేసుకోకపోతే ప్రాణాలు కూడా పోతాయి. ఇటీవల మన దేశంలో అక్కడక్కడా రేబిస్ మరణాలు చోటుచేసుకుంటున్నాయి.

**ఎంతటి ప్రమాదకరమో..**

సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఆ వీడియో విస్తృతమైన చర్చకు దారి తీస్తోంది. ఆ వీడియోలో కనిపిస్తున్న దృశ్యాలు గగుర్పాటుకు గురిచేస్తున్నాయి. ఓ మహిళ ఫోన్లో మాట్లాడుతూ ఉండగా.. ఓ ఊర కుక్క ఆమెపై దాడి చేసింది. ఆమెను కింద పడేసింది. మెడ భాగంలో కరవడానికి ప్రయత్నించింది. కానీ ఇంతలోనే స్థానికులు రావడంతో కుక్క పారిపోయింది. ఈ వీడియో చూసిన తర్వాత చాలామంది నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఊర కుక్కల అభిమానులకు ఈ వీడియో అంకితం అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు
- ఉర్దూ మీడియం స్కూళ్లలో మార్పు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఒంటిపూట బడులపై పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఒంటిపూట బడులు ప్రారంభించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకే బడులు నడపాలని అన్నియాజమాన్యాలను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 12:30 గంటల సయమంలో మధ్యాహ్న భోజనం అందజేయాలని సూచించింది. పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న స్కూళ్లలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ప్రారంభం అవుతాయని పేర్కొన్న విద్యాశాఖ.. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయని తెలిపింది.

**ఉర్దూ మీడియం పాఠశాలల తరగతుల సమయాల్లో మార్పు:**

రంజాన్ సందర్భంగా పాఠశాల సమయాల్లో తెలంగాణ విద్యాశాఖ మార్పులు చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉర్దూ మీడియం పాఠశాలలో టైమ్ టేబుల్ చేంజ్ చేసింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఆదేశించింది. అవసరమైతే వారంలో ఒక రోజు అదనంగా తరగతులు నిర్వహించాలని ఆదేశిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.





## షరతులతో కూడిన బెయిల్

- వంద రోజుల తర్వాత విడుదల కానున్న ఐబొమ్మ రవి

**ముద్ర, తెలంగాణ బ్యూరో**

పైరసీ సినిమాల వెబ్ సైట్ నిర్వాహకుడు రవికి ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. పైరసీ కేసులో గతేడాది నవంబర్ 16న అరెస్ట్ అయి.. వంద రోజుల నుంచి జైలులో ఉన్న ఆయనకు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బెయిల్ మంజూరు సమయంలో హైకోర్టు రవికి కీలక సూచనలు చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ భారతదేశం విడిచి బయటికి వెళ్లొద్దని ఆదేశించింది. ఈ క్రమంలోనే తన పాస్‌పోర్టును కోర్టులో అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత ప్రతి రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసుల ముందు హాజరు కావాలని తేల్చి చెప్పింది. ఇదిలావుంటే.. సినిమాలను ఐబొమ్మ రవి పైరసీ చేయడంతో సినిమా ఇండస్ట్రీకి రూ.వేల కోట్ల నష్టం వచ్చినట్లు హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. సినిమాలు పైరసీ చేసి.. వాటిని ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవాడని తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా రవి రూ. కోట్ల సొమ్మును దాచినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అరెస్ట్ అయినప్పటి నుంచి పలు మార్లు బెయిల్ కోసం రవి ప్రయత్నాలు చేసినప్పటికీ బెయిల్ రాలేదు. ఎట్టకేలకు అతడికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదల కానున్నాడు.

## గంట ముందే ఇంటికి

- రంజాన్ నేపథ్యంలో ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటు
- ప్రభుత్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ముస్లిం ఉద్యోగులు నెలరోజుల పాటు రోజూ గంట ముందే వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఈనెల 19 నుంచి మార్చి 20 వరకు ఈ వెసులుబాటు అమల్లో ఉంటుందని వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, టీచర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు.. బోర్డులు, కార్పొరేషన్ల ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ మినహాయింపు ఉంటుందని ప్రకటించారు. ఈ ముస్లిం ఉద్యోగులు తమ ఆఫీసులు, స్కూళ్ల నుంచి ఒక గంట ముందుగానే ఇంటికి బయల్దేరేందుకు ఈ నెల రోజులు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు స్వాగతించారు.

## అడ్డుకునే కుట్ర

- ప్రభుత్వ విధానాలు, సంకల్పంతో పెట్టుబడులు వెల్లువ
- ట్రైడెంట్ ఏఐ కంపెనీతో రూ.300 కోట్ల ఒప్పందం
- రూ.వెయ్యి కోట్లు పెట్టేందుకు ఆర్ఎక్స్ ప్రొపెల్లంట్ ముందుకు
- మీడియాతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ప్రజా ప్రభుత్వ పాలనలో అభివృద్ధిలో దూసుకువెళ్తున్న తెలంగాణకు పెట్టుబడులు రాకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. అయినా ప్రభుత్వ విధానాలు, సంకల్పంతో పెట్టుబడులు వెల్లువెత్తున్నాయని చెప్పారు. తాజాగా యూఎస్‌కు చెందిన ట్రైడెంట్ ఏఐ కంపెనీ రూ.300 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుందన్న మంత్రి... ఆర్ఎక్స్ ప్రొపెల్లంట్ రూ.వెయ్యి కోట్లు, ఫ్రాజెన్స్ కు చెందిన గ్లోబల్ హెల్త్ కేర్ కంపెనీ ఒపెల్లా వంటి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఇది రాష్ట్రానికి శుభ సూచకం అన్నారు. ఈ పెట్టుబడులతో స్థానికంగా ఉపాధి అవకాశాలను పెరుగుతాయన్నారు. మంగళవారం హైటెక్స్ లో బయో ఆసియా సదస్సు2026 ప్రారంభం అనంతరం శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. బయో ఆసియా 2026 సదస్సులో పారిశ్రామిక వేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు ఎంతో ఉత్సాహం పాల్గొన్నారని చెప్పారు. టెక్నాలజీతో భౌగోళిక, ఆర్థిక, రాజకీయ మార్పుకు అనుగుణంగా సదస్సు విజన్ పెట్టుకున్నామన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలు.. ఏఐ టెక్నాలజీ వినియోగించుకుని ముందుకు వెళ్లాలన్నారు. హెల్త్ కేర్.. ప్రజలకు అందుబాటులో ఉంచాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. 25 బిలియన్ డాలర్స్ పెట్టుబడులు సాధించాలన్నదే తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ టార్గెట్ అని చెప్పారు. త్వరలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**ఐదు లక్షల ఉద్యోగాలు టార్గెట్..**

హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్, ఫార్మా హబ్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మార్పులకు అనుగుణంగా.. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగంలో మెరుగైన టెక్నాలజీని ఉపయోగించుకుంటామని వెల్లడించారు. జినోమ్ వ్యాలీ ఫేజ్ 4 ను వంద ఎకరాలతో విస్తరించ బోతున్నట్లు వివరించారు. అత్యాధునిక మౌలిక వసతులతో జీనోమ్ వ్యాలీ ఫేజ్ 4 ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. 2035 నాటికి 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు లైఫ్ సైన్సెస్ రంగంలో ఆకర్షించేందుకు ప్రణాళిక పెట్టుకున్నామన్నారు. కొత్తగా 5 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించే లక్ష్యంతో ఉన్నామని తెలంగాణను ప్రపంచంలోని టాప్–3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలుపుతామన్నారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి ఆధునిక రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా రెడీ టు వర్క్ ఫోర్స్ సిద్ధం చేస్తామన్నారు. ఉత్పత్తి మాత్రమే కాకుండా కొత్త ఔషధాల పరిశోధన కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
18.02.2026 బుధవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# 'జనరిక్' కు ఏదీ ప్రోత్సాహం...?

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం భారత దేశం ప్రపంచంలోనే అతిపెద్ద జనరిక్ మందులు,వ్యాక్సిన్ల సరఫరాదారులలో ఒకటి,ప్రపంచ జనరిక్ ఔషధ ఎగుమతుల్లో దాదాపు 20% వాటా కలిగి ఉంది. భారతీయ ఔషధ కంపెనీలు తాము ఉత్పత్తి చేసే కొత్త ఔషధాల పరీక్షలకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం సులభతరం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ నిబంధనలు వేగవంతమైన ఔషధ ఆవిష్కరణ మరియు ప్రపంచ పోటీతత్వానికి అడ్డంకిగా ఉన్నాయని వారు పేర్కొన్నారు.భారతీయ ఔషధ కంపెనీలు తయారు చేసే ఔషధాల నాణ్యత నియంత్రణ చాలా పేలవంగా ఉందనే విషయం అందరికీ తెలిసిందే. మధ్య ప్రదేశ్ లో 2025 అక్టోబర్ లో కలుషితమైన జలుబు మందుల కారణంగా కనీసం 16 నుండి 20 మంది పిల్లలు మరణించారు..1972 లో చెన్నై 1986 లోముంబై,1988 బీహార్ లో సంవత్సరాలలో ఇలాంటి సంఘటనలు జరిగాయి, నాణ్యత లేనివి పనికిరాని విషపూరితమైన మందులను తీసుకోవడం వల్ల భారతదేశంలో ఎంత మంది మరణించారో అసలు సంఖ్య తెలియదు. జనరిక్ మందులు, దగ్గు సిరప్‌లు, టీకాలు మరియు ఔషధాల కోసం ఉపయోగించే పదార్థాలు వంటి ఓవర్‌దికౌంటర్ ఔషధాలను తయారు చేసే 10,000 కంటే ఎక్కువ ఫార్మాస్యూటికల్ ఫ్యాక్టరీలను దాదాపు 3,000 కంపెనీలు నడుపుతున్నాయి. వార్తాపత్రిక నివేదికల ప్రకారం, 2007 మరియు 2020 మధ్య, కేవలం మూడు రాష్ట్రాల్లోనే 7,500 కంటే ఎక్కువ మందుల నమూనాలను తీసుకున్నప్పుడు నాణ్యత పరీక్షలలో విఫలం చెంది ప్రామాణిక నాణ్యత లేనివి, నాసిరకం మందులుగా ప్రకటించబడ్డాయి. ఈ మందులు తగినంత పదార్థ రసాయనాలు లేకపోవడం, రోగుల రక్తంలో కరిగిపోయే సామర్థ్యం బలహీనపడటం లేదా కలుషితమైనట్లు కనుగొనబడిన కారణంగా పరీక్షలలో విఫలమయ్యాయి.. అటువంటి నాసిరకం మందుల వల్ల ప్రభావితమైన రోగుల సంఖ్య లక్షల్లో ఉంటుందని అంచనా వేయబడింది. మార్కెట్లో ఉన్న చాలా మందులు కేవలం. ఔషధాల పరీక్ష కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రయోగశాలలలో అవసరమైన పరికరాలు లేదా అర్హత కలిగిన సిబ్బంది లేరు. 2014లో, దేశంలో 10,300 ఔషధ తయారీ యూనిట్లు ఉన్నాయి, వాటిలో దాదాపు 300 పెద్ద యూనిట్లు ఉన్నాయి. దేశంలో డ్రగ్ ఇన్స్పెక్టర్ల సంఖ్య సుమారు 1,500గా అంచనా వేయబడింది. దీనికి విరుద్ధంగా, ఫార్మా పరిశ్రమను పర్యవేక్షించడానికి అవసరమైన డ్రగ్ ఇన్స్పెక్టర్ల సంఖ్య 20,000గా అంచనా వేయబడింది.గడిచిన సంవత్సరాలలో, భారతీయ ఫార్మా పరిశ్రమ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటిగా ఎదిగినప్పటికీ, ఔషధాల నాణ్యతను నిర్ధారించడం లో విఫలం చెందుతుంది.



ఆళవందార్ వేణు మాధవ్
హైదరాబాద్

# ఆచార్యులకే ఆచార్యుడు రామకృష్ణ పరమహంస



**ఫిబ్రవరి 18 రామకృష్ణ పరమహంస జయంతి**

ఆయన ఈ లోకంలో భౌతికంగా జీవించింది యాభై ఏళ్లే. కానీ వేల సంవత్సరాల ఆధ్యాత్మిక పథానికి మైలురాయిగా నిలిచారు. సర్వమతాలు సంగమించే సాగరంలో దీపస్తంభమై వెలిగారు.తను గతించినా తన పారమార్థిక ప్రభను ప్రసరింపచేస్తూనే ఉన్నారు. వారే రామకృష్ణ పరమహంస.

చరిత్ర కనీవినీ ఎరుగని రీతిలో ఆధ్యాత్మిక సాధనలు అవలంబించి శిఖరాగ్రానికి చేరుకున్న జగద్గురువు రామకృష్ణ పరమహంస. అందుకే ప్రపంచ ప్రఖ్యాత తాత్వికులు ఆర్నాల్డ్ టాయన్బీ 'వీరిలా జీవించి చూపిన ధార్మిక జ్ఞానేశ్వరుడు మరొకరు లేరు' అని కొనియాడారు. వారి జీవితం ఇగిరిపోని ఆధ్యాత్మిక చందన పరిమళం. పరమహంస హైందవ ధర్మంలోనే కాదు, ఇస్లాం, క్రైస్తవ తదితర ధర్మాల్లోని సత్యాన్నీ సాక్షాత్కరింప చేసుకున్నారు. అలా అనుభూతి చెంది 'ఎన్ని మతాలో అన్ని మార్గాలు' అంటూ వివరించారు.

రామకృష్ణులకు తల్లిదండ్రులు పెట్టిన పేరు గదాధరుడు. గదాధర్ 1836, ఫిబ్రవరి 18 న పశ్చిమ బెంగాల్ లోని హుగ్లీ జిల్లాలోని కామార్పుకూర్ అనే కుగ్రామంలో జన్మించారు.వీరి తల్లి దండ్రులు క్షుదీరామ్, చంద్రమణిదేవి. వీరు చాలా పేదబ్రాహ్మణులైనప్పటికీ ధార్మికులు.గదాధరుడు అందగాడు, బాల్యం నుండే ఇతనికి లలితకళలు, చిత్రలేఖనములో గల ప్రవేశము వలన వారి గ్రామంలో ఇతనికి మంచిపేరు ఉండేది. అయితే చదువు మీద కానీ, ధన సంపాదన మీద కానీ ఆసక్తి చూపించేవాడు కాదు. ప్రకృతిని ప్రేమిస్తూ, గ్రామం బయట పండ్ల తోటలలో స్నేహితులతో కలిసి సమయాన్ని గడిపేవాడు. దానివలన చదువు అబ్బలేదు. పూరీకి వెళ్ళే సాధువులు వీరి గ్రామం గుండా వెళ్ళేవారు. వారు ఆ గ్రామంలో ఆగి ప్రసంగిచేటప్పుడు రామకృష్ణుడు ఎంతో శ్రద్ధగా వినేవాడు. వారికి సేవలు చేసి వారి మత వాగ్యుద్ధాలను ఆసక్తితో వినేవాడు.

అన్నగారికి సహాయంగా రామకృష్ణులు దక్షిణేశ్వర కాళికాలయములో పూజలో సేవచేసేవాడు.గుడిలో ఉన్నది నిజంగా రాతి విగ్రహమేనా లేక సజీవ మూర్తా అని అది తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఒకవేళ సజీవ దేవతను పూజిస్తే కనుక ఆ దేవత ఎందుకు సమాధానము ఇవ్వడము లేదు? అనుకొనేవాడు. ఈ ప్రశ్న ఆతనిని రాత్రి, పగలు కలచివేసింది. ఇక కాళికా దేవిని ప్రత్యక్షము కమ్మని తీవ్రమైన మొరలతో ప్రార్థించడము మొదలుపెట్టాడు. తీవ్ర భక్తిభావంలో నిమగ్నమయ్యి రేయింబవళ్ళు అమ్మవారి ధ్యాసలోనే ఉండేవాడు. రాత్రిళ్ళు అడవిలో కూర్చొని ప్రార్థించేవాడు. ఒకనాడు అమ్మవారి దర్శనము పొందాడు. అప్పటి నుండి నిరంతరమూ అమ్మవారి దర్శనభాగ్యం పొందేవాడు.నిజంగా ఒక మనిషికి చేసే సేవలలాగానే అమ్మవారి విగ్రహాన్ని పూజించేవాడు. ఇంకా తృప్తి పొందక ఇతర మతములలో పరమ సత్యమును తెలిసికొనుటకై ప్రార్థించేవాడు. కొంత మంది గురువులు ఆతని దగ్గరకు వచ్చి అన్ని మతముల లో పరమ సత్యము సాక్షాత్కరించుకున్నాడని గ్రహించారు. ఈ మాట అన్ని ఊళ్ళలో వ్యాప్తి చెంది అన్ని మతముల వారు రామకృష్ణుని దర్శనానికి వచ్చేవారు.

తన అనుభవాలను ప్రపంచానికి చాటిచెప్పడానికి తగిన వ్యక్తుల కొరకు వీరు నిరీక్షిస్తుండగా మకరందము గ్రోలడానికి వచ్చు తుమ్మెదలలాగా శిష్యులు రావడం ప్రారంభించారు. వీరికి ఎందరో శిష్యులు ఉన్నప్పటికీ వీరి పేరు ప్రపంచ ఖ్యాతి పొందడానికి దోహదం చేసినది వివేకానందులు. వీరి పరిచయం విచిత్రంగా జరిగింది. అప్పటికి వివేకానందులు నిజంగా భగవదనుభం పొందిన వారిని అన్వేషిస్తూ ఎందరినో కలిసి నిరాశకు లోనై చివరికి రామకృష్ణులను కలిశారు. "మహాత్మా మీరు భగవంతున్ని చూసారా?" అని ప్రశ్నించి సానుకూల సమాధానం పొందాడు. రామకృష్ణులు కేవలం స్పర్శతో ఆధ్యాత్మిక అనుభవాలను ప్రసాదించేవాడు.

బెంగాల్ పునరుజ్జీవనం రామకృష్ణుని జీవితము, ఆతని కృషి వలన పుట్టింది అని చెప్పవచ్చు.బ్రహ్మ సమాజం, ఆర్య సమాజాలు రామకృష్ణ మిషన్ కంటే ముందునుండి ఉన్నప్పటికీ వాటి ప్రభావము రామకృష్ణుని ముందు సమాజము పై పెద్దగా ఉండేది కాదు. రామకృష్ణుని వలన పరిస్థితి నాటకీయంగా మారిపోయింది. రామకృష్ణుడు తన ప్రత్యక్ష శిష్యులకు సన్యాసము ఇవ్వడము ద్వారా రామకృష్ణ మిషన్ ను స్వయముగా ప్రారంభించాడు.స్వామీ వివేకానంద రామకృష్ణుని సందేశాలను పాశ్చాత్య దేశాలకు వ్యాపింపచేశాడు.

1886 ఆగస్టు 16న గొంతు క్యాన్సర్ తో శ్రీ శ్రీ రామకృష్ణ పరమహంస తన శరీరాన్ని విడిచిపెట్టారు.ఆయన మరణం దుఃఖకరమైన క్షణం కాదు, అది ఒక దైవిక నిష్క్రమణ.ఆయన చివరి క్షణాల్లో కూడా,ఆయన ముఖం అనంతంలోకి తిరిగి విలీనం అవుతున్నట్లుగా, అతీంద్రియమైన కాంతితో ప్రకాశించింది.

ఆయన శిష్యులు హృదయ విదారకంగా ఉన్నారు కానీ త్వరలోనే ఆయన బోధనలు మరియు ఉనికి ఇంకా తమతోనే ఉన్నాయని గ్రహించారు. ఆయన సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని వారు ప్రతిజ్ఞ చేశారు, ఇది స్వామి వివేకానంద నాయకత్వంలో రామకృష్ణ మఠం స్థాపనకు దారితీసింది.



సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747



# నిన్న – నేడు – రేపు

**(భూత – వర్తమాన – భవిష్యత్తు కాలాలు)**

నిన్న...ఆశల పరిమళమై పూతగా పుట్టాను,
కలల తాకిడితో పిందెనయ్యాను,
కాలం ఒడిలో కాయగా ఎదిగాను ——
అందాలరూపమై ఆనందాలతావునై వెలిగిపోయాను.

నేడు...అనుభవాల మాధుర్యంతో పండిపోయాను,
ఆశల అధికభారంతో పుచ్చిపోయాను,
కోరికల తీరకపోవటంతో దిగులుపడ్డాను.
కాలం అద్దంలో నా రూపం చూసి కుమిలిపోయాను.

రేపు...జ్ఞాపకాల దొంతరలై రాలిపోతాను,
గర్వాల పొరల్ని విడిచి కుళ్లిపోతాను,
దేహాన్ని చాలించి మట్టిలో కలుస్తాను,
మరొక పూతకు మూలమైపోతాను.

నేను రాలిన చోటు శూన్యం కాదు ——
అక్కడే ఒక విత్తనం ఊపిరి పీల్చుకుంటుంది,
నేను కరిగిన మట్టిలో చీకటి ఉండదు ——
రేపటి వెలుగు మూలాలు వేసుకుంటుంది.

నేను లేనిక్షణమే ప్రకృతి ప్రతిచర్య తీసుకుంటుంది ——
రాతలు కూర్చి, చరిత్రపుటలకు ఎక్కిస్తుంది.
కాలం నన్ను తుడిచినా, అక్షరాలు నన్ను నిలుపుతాయి ——
నాశనమైనా నన్ను చిరకాలం కొనసాగిస్తాయి.



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

# ఆధ్యాత్మిక అజ్ఞానమా? అధికార గర్వమా?

- **ఆదిమ సంస్కృతిపై దాడిని సహించేనా!**

**(సమత సాక్షిగా అసమానత్వమా? కాదా ..వనదేవతలపై జీయర్ వ్యాఖ్యల వెనుక అసలు రంగు!..శంకరాచార్యుల నుంచి సమ్మక్క దాకా.. అందరినీ తక్కువ చేసే అహంకారం ఎవరిది? దేవుళ్లకు సర్టిఫికెట్లు ఇచ్చే అధికారం మీకెవరు ఇచ్చారు?)**

భారతదేశం అనే మహావృక్షానికి మూలవాసులైన ఆదివాసీలే ప్రాణవాయువు వంటి వేళ్లు అని, నాగరికత ముసుగులో మనం నేడు అనుభవిస్తున్న కృత్రిమ సౌకర్యాల కంటే ఎంతో ముందే ప్రకృతిని పరమాత్మగా, అడవిని కన్నతల్లిగా, ప్రతి చెట్టును ఒక దైవంగా ఆరాధించిన గొప్ప సంస్కృతి గిరిజనులదని ప్రపంచమంతా కొనియాడుతుంటే, ఆధ్యాత్మిక గురువుగా చలామణి అవుతున్న త్రిదండి చినజీయర్ స్వామి వంటి వారు అహంకారపూరిత వ్యాఖ్యలతో ఆ పునాదులను కించపరచడం అక్షరాలా సామాజిక విద్రోహమే అవుతుంది. ముచ్చింతల్ ఆశ్రమంలో కోట్లాది రూపాయల వ్యయంతో 'సమతా మూర్తి' విగ్రహాన్ని నెలకొల్పి, లోకమంతా సమానత్వమే అని ప్రసంగాలు దంచి కొట్టే వ్యక్తి, మరోవైపు అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని, వారి వేల ఏళ్ల నాటి విశ్వాసాలను కాలరాసేలా "అడవి దేవతలకు ఇక్కడ స్థలమా? వారు అసలు దేవతలేనా?" అని ప్రశ్నించడం ఆయనలోని ఆధ్యాత్మిక అంధకారాన్ని, వర్ణ వివక్షను స్పష్టం చేస్తోంది. సమ్మక్కసారలమ్మలు అంటే కేవలం మట్టి గద్దలు కాదని, వారు అన్యాయమైన పన్నుల విధానానికి వ్యతిరేకంగా, కాకతీయ సామ్రాజ్యపు అరాచక సైన్యాన్ని ఎదిరించి, తమ జాతి అస్తిత్వం కోసం రణరంగంలో రక్తాన్ని ధారబోసిన వీరవనితలని కనీస చరిత్ర కూడా తెలియకుండా మాట్లాడటం ఆయన పీఠానికి ఉన్న గౌరవానికే భంగకరం. ఆసియాలోనే అతి పెద్ద జనసందోహం తరలివచ్చే మేడారం జాతరను ఒక చిన్నచూపుతో చూడటం, కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరచడం ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధమైన చర్యే కాకుండా, ఆదివాసీల ఉనికిపై జరుగుతున్న సాంస్కృతిక దాడి అని మనం గుర్తించాలి. పైడిరాజు నుంచి సమ్మక్క వరకు, గిరిజన తెగలు అత్యంత భక్తితో ఆరాధించే దేవతలకు "దేవతా హోదా" ఇచ్చే సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం ఏ పీఠాధిపతికి లేదని, భక్తి అనేది అంతరాత్మకు సంబంధించిన విషయమే తప్ప అది ఎవరి అబ్బసొత్తు కాదని ఈ సందర్భంగా గట్టిగా చెప్పక తప్పదు. ఆదిశంకరాచార్యుల వంటి మహనీయులనే వ్యాకరణం రానివాడని, ఆయన స్థాపించిన పీఠాలు నకిలీవని తక్కువ చేసి మాట్లాడే సాహసం చేస్తున్నారంటే,



ఆయనకు అధికార బలం, రాజకీయ అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆధ్యాత్మికత అనేది మనుషుల మధ్య అంతరాలను తగ్గించాలే తప్ప, ఇలా వర్గాల మధ్య చిచ్చు పెట్టి, ఒకరిని గొప్పగా, మరొకరిని తక్కువగా చూపేలా ఉండకూడదు. ప్రభుత్వం ఈ విషయంలో మౌనం వహించడం వల్లనే ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం అవుతున్నాయని, చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రాన్ని విస్మరించి పాలకులు స్వాముల కాళ్ల దగ్గర మోకరిల్లడం వల్ల సామాన్య ప్రజల, ముఖ్యంగా ఆదివాసీల ఆత్మగౌరవం బజారున పడుతోందన్నది కాదనలేని సత్యం. ఏ పీఠంపై కూర్చుంటే ఏం లాభం, మనసులో మాలిన్యం, మాటలో అహంకారం నిండినప్పుడు అది ఆధ్యాత్మికత కానేరదు. సమ్మక్కసారలమ్మలు ఎవరో తెలియక, వారు కేవలం "అడవి దేవతలు" అని ఈసడించుకోవడం చినజీయర్ స్వామి వంటి వారి అపరిపక్వ జ్ఞానాన్ని సూచిస్తోంది. మేడారం జాతర అనేది కేవలం ఒక వేడుక కాదు. అది అన్యాయానికి వ్యతిరేకంగా సాగిన పోరాట వారసత్వం. కోట్లాది మంది భక్తులు కులమతాలకు అతీతంగా తరలివచ్చే ఆ పవిత్ర స్థలాన్ని అవమానించడం అంటే, తెలంగాణ అస్తిత్వాన్ని, గిరిజన తెగల సంస్కృతిని అవమానించడమే. ఇలాంటి ఉదంతాల్లో సామాన్య వ్యక్తులపై వెంటనే కేసులు నమోదు చేసే యంత్రాంగం, ఒక కార్పొరేట్ స్థాయి ఆధ్యాత్మిక సామ్రాజ్యాన్ని నడుపుతున్న వ్యక్తి విషయంలో ఎందుకు మెతకవైఖరి ప్రదర్శిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎస్సీ, ఎస్టీ చట్టం లేదా అట్రాసిటీ చట్టం ప్రకారం, ఒక వర్గం యొక్క ఆచారాలను లేదా నమ్మకాలను బహిరంగంగా కించపరచడం శిక్షార్హమైన నేరం అని చట్టాలు ఘోషిస్తున్నా, చర్యలు ఎందుకు శూన్యం?

ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆదివాసీ సంఘాల డిమాండ్ మేరకు ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ జరపాల్సిన అవసరం ఉంది. రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత భక్తిని పక్కన పెట్టి, రాజ్యాంగ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వందల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న చినజీయర్ స్వామి నేపథ్యం చూస్తే, ఆయన ఎదుగుదల వెనుక కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాకుండా భారీ రాజకీయ, కార్పొరేట్ అండదండలు ఉన్నట్లు కనిపిస్తోంది. నిజమైన ఆధ్యాత్మిక వేత్తకు ఉండాల్సిన లక్షణం వినయం, కానీ చినజీయర్ స్వామి వ్యాఖ్యల్లో వినిపించేది అహంకారం మరియు ఇతర సంప్రదాయాల పట్ల ద్వేషం.

ఆదివాసీల సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. ప్రకృతిని ప్రేమించే వారు, దానిని కాపాడుకోవడానికి ప్రాణాలైనా ఇస్తారు. వనదేవతలను కించపరిచిన ప్రతీ మాటకూ చినజీయర్ స్వామి సమాధానం చెప్పాల్సిందే. ప్రభుత్వం అహంకారపు పీఠాలకు కాకుండా, రాజ్యాంగానికి మరియు ప్రజల నమ్మకాలకు విలువ ఇవ్వాలి. లేనిపక్షంలో, మేడారం గద్దెపై నుంచి మొదలయ్యే నిరసన జ్వాలలు గద్దెలను సైతం కదిలిస్తాయి. అడవి తల్లి బిడ్డలైన ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. అధికార గర్వంతో చేసే ఇలాంటి వ్యాఖ్యలను సమాజం ముక్తకంఠంతో ఖండించాలి.

అడవి బిడ్డల ఆత్మగౌరవం ఆకాశమంత. దానిని కాషాయం ముసుగులో కించపరచాలని చూస్తే చరిత్ర క్షమించదు. దేవుళ్లకు సర్టిఫికెట్లు ఇచ్చే అధికారం ప్రజలు ఎవరికీ ఇవ్వలేదు. చట్టం తన పని తాను చేయాలి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే రాజ్యాంగబద్ధమైన 'సమత'కు నిజమైన గౌరవం లభిస్తుంది.



వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

భారతదేశంలోని ప్రముఖ టాప్ 3 ఐటీ కంపెనీ
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ (HCLTech) : ఐటీ సేవలు, ఇంజనీరింగ్, R&D రంగాల్లో ప్రముఖ సంస్థ. క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ సేవల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది.





## తాండూర్ అభివృద్ధికి చేయూత ఇవ్వాలి

**ముద్ర, తాండూర్ :**

తాండూర్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆర్బీఎల్ సీఈఓ బియ్యని శ్రీనివాస్ రెడ్డిని మున్సిపల్ ప్రతినిధులు కోరారు. బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఇటీవల ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అబ్దుల్ రజాక్‌తోపాటు గెలుపొందిన నూతన కౌన్సిలర్లను ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బియ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో ఎన్నుకున్న ప్రతినిధులు వారి ఆశలను నిలబెట్టాలని సూచించారు. వార్డు సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించాలని, అందులో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎల్ ఎండీ బియ్యని సరళ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పార్టీ నాయకులు అబ్దుల్ రహూఫ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ముద్ర, తాండూర్ :**



పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైనందునా ప్రార్థన మందిరాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కౌన్సిలర్ ఇర్షాద్ మున్సిపల్ అధికారును కోరారు. మంగళవారం నుంచి రంజాన్ నెల ప్రారంభమైనందున అధిక మొత్తంలో ప్రజలు నమాజ్ చేయడానికి ప్రార్థన మందిరాలకు వస్తారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వారికి ఏ ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మీడియా అక్రిడేషన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు

**ముద్ర, వనపర్తి :**



వనపర్తి జిల్లాలో 2026-28 సంవత్సరాల కొత్త మీడియా అక్రిడేషన్ల జారీ కోసం నూతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీలో సభ్యత్వం పొందేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు సంఖ్య 252 ప్రకారం జిల్లాలోని మీడియా అసోసియేషన్లు, సంఘాలు తమ ప్రతినిధి పేరును లెటర్‌ప్యాడ్‌పై పేర్కొని ఫిబ్రవరి 19లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. బిగ్ తెలుగు డైలీ, ఉర్దూ డైలీ, మీడియం డైలీ, స్మాల్ డైలీ, ఎలక్ట్రానిక్ మీడియా, వీడియో జర్నలిస్ట్, ఫోటో జర్నలిస్ట్ విభాగాల నుంచి ఒక్కొక్క ప్రతినిధిని ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వం ఉత్తర్వు సంఖ్య 252లోని రూల్ 3, సబ్ రూల్ 1(సి) ప్రకారం ఆయా ప్రతినిధులు పూర్తి కాల జర్నలిస్టులై ఉండాలి. బిగ్ డైలీ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి. మిగిలిన విభాగాల ప్రతినిధులకు కనీసం 5 సంవత్సరాల మీడియా అనుభవం తప్పనిసరి. అసోసియేషన్లు, సంఘాలు తమ ప్రతినిధుల వివరాలను ఫిబ్రవరి 19 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, వనపర్తికి అందజేయాలని కలెక్టర్ సూచించారు. గడువు అనంతరం అందిన ప్రతిపాదనలు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడవని స్పష్టం చేశారు.

## బుద్ధుని ఆశయ సాధనకు కృషి : నటుడు గగన్ మాలిక్

**ముద్ర, కూకట్‌పల్లి :**



గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి, సమానత్వ మార్గంలో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ బాలీవుడ్ నటుడు, బౌద్ధ ధర్మ ప్రచారకుడు గగన్ మాలిక్ పిలుపునిచ్చారు. బుద్ధ ధమ్మయాత్ర మూడవ వార్షికోత్సవం సందర్భంగా కర్ణాటక నుంచి హైదరాబాద్‌లోని బుద్ధ భవన్ వరకు సుమారు 80మంది బౌద్ధ భిక్షువులు, ఉపాసకులు చేపట్టిన 450కిలోమీటర్ల పాదయాత్ర మంగళవారం హైదర్‌నగర్‌కు చేరుకుంది. ఈసందర్భంగా హైదర్‌నగర్ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు యాత్రికులకు ఘనంగా స్వాగతం పలికారు. గగన్ మాలిక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బౌద్ధమతంలోని పంచశీల సూత్రాలైన అహింస, అస్తేయం(దొంగతనం చేయకపోవడం), సత్యం, బ్రహ్మచర్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారానే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బావోజి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ముద్ర, నారాయణ పేట :**



కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఏప్రిల్ 1 నుంచి 4 వరకు జరిగే శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు(బావోజి) బ్రహ్మోత్సవాలకు అధికారులు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ కు నోడల్ అధికారి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు జాతర ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా విఐపి మేనేజ్ మెంట్ జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. దేవాదాయ శాఖ పరంగా ఏం ఏర్పాట్లు చేశారని అడిగారు. ఆలయానికి, రథానికి కలర్స్ వేయిస్తున్నామని, మిగతా జాతర ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు. జాతర కోసం తమ శాఖ నుంచి మొత్తం 15 మంది ఉద్యోగులు సిబ్బందిని డిప్యూట్ చేయగా ప్రస్తుతానికి ఇద్దరు వచ్చి విధుల్లో చేరారని, మిగతా 13మంది రెండు రోజుల్లో వస్తారని ఈవో తెలిపారు. గతేడాది మాదిరిగానే ఈ సారి ఆలయంలో సీసీ కెమెరాలు అమర్చుతామని ఈవో తెలపగా, పోలీసు శాఖ కోరినట్లు మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ పరంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కొరకు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎలాంటి ప్రాబ్లం లేకుండా చూడాలన్నారు. డోర్స్ తదితర దానికి సెప్టిక్ ట్యాంక్ మెయింటెనెన్స్ గ్రామపంచాయతీ వాళ్ళు చూసుకోవాలన్నారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ మొబైల్ టాయిలెట్స్ బస్సు ట్యాంకర్ దగ్గర బట్టలు మార్చుకొనుటకు వెదురు తడకలతో తాత్కాలిక బాత్రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ ఈ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరా కై 20 మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలని మొబైల్ ట్రాన్స్ఫార్మర్, లుస్ లైన్స్ లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రవాణా సంస్థ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని తెలిపారు. తసిల్దార్ కొత్తపల్లి కంట్రోల్ రూమ్ చూడాలని, మద్దూర్ ఎంపీడీవో జాతర అయిన తర్వాత కూడా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. బడ్జెట్ కొరకు దేవాదాయ శాఖ తయారు చేయాలని రెగ్యులర్ ఈవో ఉండాలని దేవాలయ ఫౌండర్ మాజీ చైర్మన్ ఆఫ్ టెంపుల్ గోపాల్ కోరారు. ఎక్సైజ్ శాఖ రెండు మొబైల్ టీమ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# మణికొండలో పేలిన మంజీరా పైప్ లైన్

- **ధ్వంసమైన మురుగునీటి వ్యవస్థ**
- **అపార్ట్మెంట్లలోకి చేరిన నీరు**
- **భయాందోళనకు గురైన స్థానికులు**

**ముద్ర, బండ్లగూడ :**



మణికొండలో తెల్లవారుజామున మంజీరా పైప్ లైన్ ఒకసారిగా పేలింది. ఆంధ్రా బ్యాంకు వీధిలోని ఓ సూపర్ మార్కెట్ ఎదురుగా బుధవారం తెల్లవారుజామున మంజీరా పైప్ లైన్ పెద్ద శబ్దంతో పేలింది. ఈ పేలుడు దాటిలో దగ్గరలోని మురుగునీటి పారుదల కాల్వలు కూడా ధ్వంసమయ్యాయి. ఒక్కసారిగా మంచినీరు మురుగునీరు కలిసి పక్కనే ఉన్న రెండు అపార్ట్మెంట్ల సెల్లార్లలోకి చేరాయి. పేలుడు సమయంలో రోడ్డు పూర్తిగా కుంగిపోయి అక్కడ పెద్ద గోతి ఏర్పడింది. అపార్ట్మెంట్ల నుంచి బయటకు రావడానికి అవకాశాలు లేకపోవడంతోపాటు నీరు ఇంకా చేరుతుండడంతో స్థానికులు తమను కాపాడాలి అంటూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పంపించారు. కేవలం ఐదు నిమిషాల్లో సెల్లార్లు, రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. సమాచారం అందుకున్న మంచినీటి సరఫరా శాఖ అధికారులు వెంటనే నీటి సరఫరాను నిలిపివేశారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకొని సెల్లార్లలో చేరిన నీటిని 4 గంటలపాటు శ్రమించి తోడేశారు. ప్రస్తుతం పైప్ లైన్, మురుగునీటి వ్యవస్థకు మరమ్మత్తులు చేస్తున్నామని గురువారం వరకు మరమ్మతులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

## మంచినీటి సమస్యల పరిష్కారానికి వినతి

**ముద్ర, మల్కాజిగిరి :**

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి ప్రాంతంలో నెలకొన్న మంచినీటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు శ్రవణ్ వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన వాటర్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రత్యేకంగా బోర్‌వెల్ నీటిపై ఆధారపడ్డ బస్తీలలో బోర్వెల్‌లు పనికిరాని స్థితిలో ఉన్నాయని, వాటి మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల వాటర్ వర్క్స్ బోర్డు నుంచి మంజూరైన భూగర్భ డ్రైనేజీ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రిజర్వాయర్‌లో సాంకేతిక సమస్యలు, మోటార్లు పాడైపోవడం వంటి కారణాలతో తరచూ మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందని తెలిపారు. ముఖ్యంగా ఓల్డ్ మల్కాజ్గిరి ప్రాంత ప్రజలు తక్కువ ప్రెషర్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందు యాదవ్, మురళి గౌడ్, ఆనంద్ ముదిరాజ్, నరసింహ, మాధవ్, రవి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రహిత వైట్‌ఫీల్డ్ లక్ష్యం : పీఏసీ చైర్మన్

**ముద్ర, శేరిలింగంపల్లి :**



కొండాపూర్ డివిజన్ పరిధిలోని వైట్‌ఫీల్డ్ కాలనీలోని శ్రీ రామాలయం దేవాలయం నుంచి అంజయ్య నగర్ వరకు నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికారులతో కలిసి పరిశీలించారు. సీ బాలకృష్ణ, ట్రాఫిక్ సిఐ సురేష్ మరియు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. రామాలయం దేవాలయం నుంచి అంజయ్య నగర్ వరకు ప్రతిరోజూ తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారం కోసం రోడ్డు విస్తరణతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని చెప్పారు. వైట్‌ఫీల్డ్ కాలనీలో మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర అంశాలపై అసోసియేషన్ సభ్యులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ గోవర్ధన్, డీఈ దుర్గాప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కరుణాకర్, టీపీఎస్ సంతోష్, ఎస్డబ్ల్యూఎం డీఈ రూపాదేవి, ఏఈ మన్యం, ఎస్ఆర్పి కిరణ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 101 కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

**ముద్ర, శేరిలింగంపల్లి :**




కొల్లూరులో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని శేరిలింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా గంజాయిని నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ సిబ్బంది సంయుక్తంగా అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్వ జగన్నాథం(37), పల్లపు లక్ష్మీనారాయణ(52)లు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి వ్యాపారానికి అలవాటు పడ్డారన్నారు. ఒడిశాకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి సుమారు 101.7 కిలోల గంజాయిని తెప్పించి, తెల్లాపూర్ పరిధిలోని శిల్పా వెంచర్ సమీపంలో కార్మికుల క్యాంపుల వద్ద విక్రయించేందుకు నిల్వ చేశారని తెలిపారు. ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడి నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 25.72లక్షల విలువైన గంజాయి తోపాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు రాజు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కొల్లూరు సీఐ గణేష్ పటేల్, ఎస్ఓటీ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. గంజాయి లేదా మాదకద్రవ్యాల సరఫరాపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా సైబరాబాద్ ఎన్‌డీపీఎస్ సెల్ వాట్సాప్ నంబర్ 9490617444కు ఫిర్యాదు చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

**ముద్ర, తాండూర్:**

ఆర్థికంగా వెనుకబడిన 8వ వార్డు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని బీఆర్ఎస్ 8వ వార్డు కౌన్సిలర్ జావిద్ తెలిపారు. వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలు పట్టణానికి ఆమడ దూరంలో ఉండటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజనం, తరగతి గదులు మరియు ఇతర సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారం జరిగేలా కృషి చేస్తానని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నానని కౌన్సిలర్ జావిద్ తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
18.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**భారతదేశంలోని ప్రముఖ టాప్ 4 ఐటీ కంపెనీ**

విప్రో (Wipro) : ఐటీ, కన్సల్టింగ్, బిజినెస్ ప్రాసెస్ సేవల్లో ప్రముఖ సంస్థ. గ్రీన్ టెక్నాలజీ, సస్టెనబిలిటీ పై దృష్టి పెట్టింది.




# వెల్గటూర్ రోడ్డు నుంచి కోటిలింగాలకు ఫోర్ వే..

- **జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

**ముద్ర, జగిత్యాల:**

రానున్న గోదావరి పుష్కరాల కోసం భక్తులకు కావాల్సిన వసతులను ఏర్పాట్లు చేయడానికి కలెక్టర్ సత్య ప్రసాద్ ముందస్తుగా మంగళ వారం అధికారులతో కలసి కోటిలింగాల, రాయపట్నం గ్రామాల్లో పర్యటించారు. గోదావరి పుష్కరాలకు ధర్మపురి తర్వాత కోటిలింగాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. పుష్కరాల కోసం ఇక్కడికి విచ్చేయనున్న భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే దానిపై అధికారులతో కలెక్టర్ కోటిలింగాలలో సమీక్షించారు. సుమారుగా 50 లక్షల మంది భక్తులు పుష్కరాల కోసం కోటిలింగాలకు వచ్చే అవకాశం ఉంది. ఆ మేరకు కోటిలింగాల టెంపుల్ పరిధిలో పరిసర ప్రదేశాల్లో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి తక్షణమే అంచనాలు తయారు చేసి ఇవ్వాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వచ్చే గోదావరి పుష్కరాల కోసం కోటిలింగాల దాని పరిసర ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి ఆయా శాఖల అధికారులతో చర్చించి కలెక్టర్ మాట్లాడారు. వెల్గటూర్ స్టేట్ హైవే నుంచి కోటిలింగాల టెంపుల్ వరకు ఉన్న రోడ్డుని ఫోర్ వేగా మార్చటం, అందుకు అవసరమైన భూమిని ఇరువైపులా రైతుల నుంచి సేకరిస్తామన్నారు. గోదావరి తీరంలో భక్తుల పుణ్య స్నానాల కోసం అదనంగా 150 మీటర్ల ఘాట్‌ను నిర్మిస్తామన్నారు. పార్కింగ్ కోసం అవసరమైన 150 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. పార్కింగ్ కోసం గుర్తించిన స్థలం పూర్తిగా పంట పొలాలతో నిండి ఉంటుందని, వచ్చే ఏడాదిలో రైతులు ఖరీఫ్ పంట సాగు చేయకుండా క్రాప్ హాలిడేను ప్రకటిస్తామన్నారు. అందు కోసం రైతులకు ముందస్తుగా పంట నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. రైతులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. శానిటేషన్, విద్యుత్, మంచినీరు వసతుల కల్పన గురించి ఆయా శాఖల అధికారులు కావాల్సిన అంచనాలు ఇప్పుడే రూపొందించి త్వరగా ఇస్తే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజగౌడ్, ఆర్డీవో పులి మధుసూదన్ గౌడ్ తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓ వెంకట ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# ఖానాపూర్ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా..



- **హాజరు కాని బిజెపి, బిఆర్ఎస్ కౌన్సిలర్లు**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పురపాలక సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మంగళవారం కూడా వాయిదా పడింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం పదవి స్వీకార ప్రమాణం, చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక జరగాల్సి ఉంది. అయితే బిజెపి, బిఆర్ఎస్ కౌన్సిలర్లు రాకపోవడంతో కోరం లేక వాయిదా పడింది. మంగళవారం కాంగ్రెస్ మినహా బిజెపి, బిఆర్ఎస్ కౌన్సిలర్లు రాలేదు. దీంతో అధికారులు ఎన్నికను వాయిదా వేస్తూ తిరిగి ఎప్పుడు జరిగేది ప్రకటిస్తామని వెల్లడించారు. ఇదిలా ఉండగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు మాత్రం చైర్మన్ పదవి తమ పార్టీకే వస్తుందని ధీమాగా ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా తన ఓటు ఉన్నందున తమ పార్టీ గెలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ 4, బిజెపి 4, బిఆర్ఎస్ 4 సీట్లు గెలుచుకోవడంతో ఈ ప్రతిష్టంభన నెలకొంది. ఎన్నిక సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను ఎస్పీ జానకి షర్మిల స్వయంగా పర్యవేక్షించారు.

# భర్తను హతమార్చిన భార్య

**ముద్ర, మందమర్రి:**

భర్తను గొడ్డలితో భార్య నరికి చంపిన ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో జరిగింది. మందమర్రిలోని శాంతినగర్‌కి చెందిన మోయిన్, అవంతి లు గతంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. సజావుగా సాగిన వీరి సంసారంలో కొద్ది రోజులుగా కలహాలు జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన గొడవలో ఆవేశానికి గురైన భార్య ఇంట్లోని కత్తితో భర్త మొయిన్‌పై దాడిచేసింది. త్రంగా గాయపడిన మెయిన్‌ను స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటన స్థలానికి ఎస్సై గోపతి నరేష్ చేరుకొని అవంతిని విచారించగా భర్త వేధింపులు తాళలేక హత్య చేసినట్లు చెప్పింది. పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు.

# పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

**ముద్ర, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నందగిరికి చెందిన మక్కపల్లి రమ్య (15) అనే పదో తరగతి విద్యార్థిని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పెగడపల్లి ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. రమ్య కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కాగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతూ 15 రోజుల క్రితం ఇంటికి వచ్చింది. ఆసుపత్రలో చికిత్స అందించినా ఆమె పూర్తిగా కోలుకోలేదు. దీంతో ఆమె అనారోగ్యం భరించలేక ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# వైభవంగా దుబ్బ రాజన్న ఆలయ రథోత్సవం



**ముద్ర, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్‌లోని దుబ్బ రాజన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారులు, గుస్సాడీ నృత్యాల మధ్య భక్తుల కాగడాలు, శివసత్తుల పూనకాల మధ్య శివనామ స్మరణతో భక్తులు రథం లాగారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## నార్నూర్ మండలాన్ని ఆదర్శవంతంగా
# తీర్చిదిద్దేందుకు చర్యలు

- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ముద్ర, ఆదిలాబాద్:**

నీతి అయోగ్‌లో భాగంగా మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం నార్నూర్ మండల కేంద్రంలో డిజిటల్ లైబ్రరీతో పాటు ఐటీ స్కిల్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనతరం కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత భవిష్యత్తుకు విద్య ఓ ఆయుధమని అన్నారు. నార్నూర్ మండలంలో దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. యువత పుస్తక, దినపత్రిక పఠనంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మండల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మాట్, అడిషనల్ జిల్లా కలెక్టర్ రాజేశ్వర్, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఐటీడీఏ ఈ ఈ తానాజీ, ఐసీడీఎస్ పీడీ మిల్కా, తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో పుల్లారావ్, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్



**ముద్ర, జగిత్యాల:**

జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 15న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఫిబ్రవరి 15న జగిత్యాల బైపాస్ రోడ్డులో రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన బోరె విశ్వనాథ్ (30) పై కర్రతో దాడి చేయగా మృతి చెందాడు. మృతుడి తండ్రి బోరె చంద్రయ్య ఫిర్యాదు మేరకు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మృతుడు బోరె విశ్వనాథ్‌కు మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి చెందిన వివాహిత ఆలకుంట లక్ష్మితో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మీ భర్త ఆలకుంట గంగాధర్ తన బావమరిది బోదసు తిరుపతితో కలిసి విశ్వనాథ్‌ను హత్య చేశారు. పక్కా సమాచారం మేరకు మంగళవారం పట్టణంలోని లింగంపేట రైల్వే స్టేషన్ సమీపంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు హత్య నేరాన్ని ఒప్పుకున్నారు. టౌన్ సీఐ కరుణాకర్ నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

**ముద్రప్రతినిధి, నిర్మల్:**

ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. మండలాల వారిగా పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు మంజూరైన వారి మార్కౌట్ పూర్తి చేసి, పనులు ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించాలన్నారు. నిర్మాణాలు మందగించిన ప్రాంతాల్లో లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ కు టీఎన్జీవోల సంఘం శుభాకాంక్షలు

- **టీఎన్జీవోల సంఘం శుభాకాంక్షలు**

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన కోలగాని శ్రీనివాస్, యాదగిరి సునీల్ రావు ను మంగళవారం టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శాలువా, పూలబొకేలు అందజేసి సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలని, రాబోయే రోజుల్లో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ కు టీఎన్జీవోల సంఘం 2026 డైరీ ని కూడా అందజేశారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్షణ్ రావు, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, రూరల్ అధ్యక్షుడు కోడూరి వాస్తావిక్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, నాయకులు శ్రీనివాస్, అశోక్, ముత్తయ్య, మల్క రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు



భారతదేశంలోని ప్రముఖ టాప్ 5 ఐటీ కంపెనీ

టెక్ మహీంద్రా (Tech Mahindra) : టెలికాం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవల్లో నిపుణులు. 5G, ఏఐ, మెటావర్స్ రంగాల్లో కొత్త అవకాశాలను అందిస్తోంది.





## యథావిధిగా ప్రత్యేక గ్రీవెన్స్



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగ వాణి కార్యక్రమం యధాతథంగా ఉంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గురువారం నిర్వహించే గ్రీవెన్స్, ఉద్యోగ వాణి కార్యక్రమం యథావిధిగా ఉంటుందని ప్రజలు, ఉద్యోగులు వారి సమస్యల పై దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రజలు కలెక్టరేట్ కు వచ్చి ఫిర్యాదులు ఇవ్వవచ్చని తెలిపారు.



## వైభవంగా సుదర్శన చక్రస్నానం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం స్వామి వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో 'అష్టోత్తర శతకలశాభిషేకం' నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ 108 పవిత్ర కలశాలతో స్వామి వారికి జరిగిన ఈ అభిషేక సేవను భక్తులు కన్నులారా వీక్షించి తరించారు. బ్రహ్మోత్సవాల విశిష్ట ఘట్టమైన 'సుదర్శన చక్రస్నానం' జల నారాయణుడి సన్నిధిలో అత్యంత వేడుకగా జరిగింది. పవిత్ర జలాల్లో సుదర్శన స్వామివారికి శాస్త్రోక్తంగా పుణ్యస్నానం ఆచరింపజేశారు.



## తుంగతుర్తిలో కేసిఆర్ పుట్టినరోజు వేడుకలు

**ముద్ర, తుంగతుర్తి:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టి రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ జాతిపిత కెసిఆర్ అని బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం తుంగతుర్తిలో మెయిన్ రోడ్ పై తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ 72 వ జన్మదిన వేడుకలు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నారం, వెంపటి, రావులపల్లి, కొత్తగూడెం సర్పంచులు కుంచాల శ్రీనివాస్ రెడ్డి, తప్పట్ల ఎల్లయ్య, చింతకుంట్ల మనోజ్, మేడ్డుల రమేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుండగాని రాములు గౌడ్, దొంగరి శ్రీను, తునికి సాయిలు గౌడ్, గొపగాని రమేష్ గౌడ్, గౌడ్ చర్ల సత్యానారాయణ, గోపగాని శ్రీనివాస్,మల్యాల రాములు, గుడిపాటి వీరయ్య పాల్గొన్నారు.




## పకడ్బందీగా మ్యాపింగ్ ప్రక్రియ

- **రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ, ఏ.ఈ .ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- **భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



జిల్లా లో పలు సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ యస్ ఇ , ఈఈ, డిఈ, ఏఈ, ఆర్ అండ్ బి ఇంజినీరింగ్ విభాగం అధికారులతో అన్ని రకాల అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లా లో మంజూరైన పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రస్తుతం అవి ఏ దశలో ఉన్నాయని, ఏ మేరకు నిధులు ఖర్చు చేశారని, ఎక్కడెక్కడ సదుపాయాల పునరుద్ధరణ జరిగింది తదితర వివరాలను ఆరా తీశారు. కలెక్టరేట్ లో నిర్మాణం లో ఉన్న శ్రీ శక్తి భవనం నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మహిళా దినోత్సవం రోజు ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని అందుకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలన్నారు. వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టిన నేపథ్యంలో నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లతో ఒప్పందం ఉన్నప్పటికీ, పనులను ఎందుకు కావడం లేదని నిలదీశారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువు లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల సౌకర్యాల కల్పన విషయంలో ఎంత మాత్రం రాజీ పడకూడదని, జాప్యానికి తావు లేకుండా ఆయా విభాగాల వారీగా పనులను విభజించుకొని, ఏకకాలంలో జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గడువు లోపు పనులన్నీ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జడ్పీ సి ఈ ఓ శోభా రాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి,సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక

- **భువనగిరి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

రబీ 202526 వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ తన చాంబర్ లో ధాన్యం సేకరణలో ప్రాతినిధ్యం వహిస్తున్న సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా టోకెన్ పద్ధతి ద్వారా కొనుగోళ్లు జరిపి, ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ఎత్తు, పల్లాలు సరిచూసుకుని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో సరైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనగా, వేయింగ్ మెషీన్ లు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ లు, గన్నీ బ్యాగులను సరిపడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం 50 టార్పాలిన్ షీట్లను అందజేయాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు హరికృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి,సంబంధిత అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.



## పార్టీ లకు అతీతంగా అభివృద్ధి చేస్తా

- **భువనగిరి చైర్ పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పార్టీ లకు అతీతంగా భువనగిరి మున్సిపల్ అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ అన్నారు. మంగళవారం భువనగిరి మున్సిపల్ చైర్మన్ తాంగ్గెళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ ని పుర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పార్టీ లకు అతీతంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో భువనగిరి మున్సిపల్ అభివృద్ధి చేస్తానని తెలిపారు. 17 వార్డ్ కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్ చైర్ పర్సన్ ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.





## విద్యార్థులకు పండ్లు పంపిణీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మండలంలోని తాజ్పూర్ గ్రామంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు సర్పంచ్ రాకల సంతోషా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ కూడలి వద్ద కేక్ కట్ చేసి విద్యార్థిని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం కోసం చావు నోట్లో తలపెట్టి సాధించాడని రాష్ట్ర ప్రజలు మళ్లీ ఆయనని ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇందిరమ్మ పనులు త్వరగా పూర్తి చేయాలి

- **భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పురోగతి లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మినీ మీటింగ్ హాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నిర్మాణం పనులను పూర్తి చేసిన వారి పై ఎంపీడీఓ, ఎంపీ ఓ లు, హౌసింగ్ సిబ్బంది తో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయిన లబ్ధిదారులకు జాబ్ కార్డులు, ఉపాధి హామీ పథకం, వ్యక్తిగత మరుగుదొడ్డు నిర్మాణపు పనులపై మండలాల వారీగా, జిల్లా కలెక్టర్ హనుమంత రావు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, హౌసింగ్ పీడీ విజయసింగ్, శ్రీరాములు, ఎంపీడీవోలు, ఏ పి ఓ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమాలకు చిరునామా కేసీఆర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి**

జాతిపిత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72 వ జన్మదిన వేడుకలు జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో మంగళవారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి, భువనగిరి మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ అరవై ఏళ్ల స్వరాష్ట్ర కలను సాకారం చేసి, తొమ్మిదిన్నరేండ్ల పాలనలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపి అభివృద్ధి, సంక్షేమాలకు చిరునామాగా నిలిచారి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, పట్టణ అధ్యక్షులు ఏవీ కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు చెన్న స్వాతి మహేష్, చీమల రాజు, నాకోటి నగేష్, ఏలే భువనేశ్వరి శివ, సీనియర్ నాయకులు శెట్టి బాలయ్య యాదవ్, కుషాంగాల రాజు, ఖాజా అజీముద్దీన్, తుమ్మల పాండు, ఇక్బాల్ చౌదరి, శాగంటి నర్సింహ, నిలగొండ శివ, గుమ్ముల మల్లేశం, ఎండి ఖాజాం, గుజ్జ పవన్, కాదరి ప్రవీణ్, చిక్క ప్రభాకర్, వాకిటి కుమార్, సురేష్ యాదవ్, మంద వెంకటేశం, సిరిపంగ సుభాష్,



ముస్త్యాల ఆనంద్, ఎండి అఫ్జల్, గుండెబోయిన నర్సింహ, ముదిగొండ మహేష్, ఇండ్ల శ్రీనివాస్, తుమ్మల వినోద్, మహిళా నాయకురాళ్లు రత్నాపురం పద్మ, పావని, వనజా పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
18.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



భారతదేశంలోని ప్రముఖ టాప్ 6 ఐటీ కంపెనీ
ఎల్‌టీఐమైండ్‌ట్రీ (LTIMindtree) : Larsen & Toubro గ్రూప్‌కు చెందిన ఐటీ సంస్థ. డిజిటల్, క్లౌడ్, డేటా అనలిటిక్స్ సేవల్లో వేగంగా ఎదుగుతోంది.






# ఆసుపత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జోగిపేట ఏరియా ఆసుపత్రిని మంగళవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ షరీఫ్ తనిఖీ చేశారు. సోమవారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం మేరకు ఆయన వార్డుల్లో తిరిగారు. రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బెడ్ పైన రెస్ట్ గా ఉండేందుకు వీల్ బెడ్స్, వెస్ట్రన్ బాత్ రూం కావాలలని పలువురు పేషెంట్లు విన్నవించారు. ఆ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. అలాగే అంబులెన్స్ సౌకర్యం గురించి రోగులను అడుగగా.. 108 మాత్రమే ఉచితంగా సేవ చేస్తుందని చెప్పారు. కాని హాస్పిటల్ అంబులెన్స్ కు మాత్రం వెయ్యి రూపాయల డీజిల్ తో పాటు బత్తా రూ. 200 చెల్లిస్తున్నట్లు రోగులు జిల్లా అధికారికి పిర్యాదు చేశారు. వెంటనే ఆ డ్రైవర్ ను పిలిపించి డబ్బులు తీసుకుంటున్న విషయం అడిగారు. ఇప్పుడు కొత్త కాదు, 25 ఏళ్లుగా వసూలు చేస్తున్నామని చెప్పడం గమనార్హం. మంత్రి వచ్చినప్పుడు లీవ్ లో ఉన్న ఏడుగురు వైద్యులు, అలాగే చీటికిమాటికి డుమ్మాలు కొట్టే వైద్యులతో పాటు అంబులెన్స్ డ్రైవర్ పై కూడా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఈ ఆస్పత్రిలో 31 మంది డాక్టర్లు అవసరం ఉండగా, పది మంది రెగ్యులర్ విధులు నిర్వహిస్తున్నారు. కొందరిని జిల్లాలోని ఆసుపత్రుల నుంచి సర్దుబాటు చేస్తూ 23 మంది జోగిపేట హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్నారు. కానీ డాక్టర్లు సమయపాలన పాటించని, విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్లు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు నివేదికను సమర్పిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. వ్యక్తికి 15 రోజుల జైలు శిక్ష

**ముద్ర, బీర్కూర్:**

మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి న్యాయమూర్తి రూ.5 వేలు జరిమానా, 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం. . బీర్కూర్ గ్రామానికి చెందిన బశెట్టి ఈ నెల 13న మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతనిపై గతేడాది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైంది. మరోసారి నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనం నడిపి రెండోసారి పట్టుబడ్డాడు. మంగళవారం నిందితుడిని కోర్టు కానిస్టేబుల్ సాయిబాబా బాన్సువాడ కోర్టులో హాజరుపర్చగా. . న్యాయమూర్తి బశెట్టికి 15 రోజులు జైలు శిక్ష విధించి రూ.5 వేలు జరిమానా విధించారని ఎస్సై తెలిపారు.

# బీరువా ఎత్తుకెళ్లిన దొంగలు

కామారెడ్డి : కామారెడ్డి జిల్లాకేంద్రం వినాయక్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శమీమున్నీసాబేగం తాళం వేసి బయటకు వెళ్లారు. తాళాలు పగులగొట్టి ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువాను ఎత్తుకెళ్లారు. అందులో 2 తులాల బంగారం, కొంత నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై 100కి సమాచారం ఇవ్వగా పోలీసు సిబ్బంది చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి వివరాలు సేకరించారు.



# కారు అద్దాలు పగులగొట్టి.. రూ.8 లక్షలు చోరీ

**ముద్ర, బాన్సువాడ :**

బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి.. అందులోని రూ. 8 లక్షలు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. బిచ్కుంద మండలం హజ్గుల్ గ్రామానికి చెందిన మాధవరావు షాపింగ్ నిమిత్తం తన కారును రిలయన్స్ మార్ట్ వద్ద పార్క్ చేశారు. షాపింగ్ పూర్తి చేసుకొని తిరిగి వచ్చేసరికి కారు అద్దాలు పగులగొట్టి ఉండడం గమనించారు. కారులో ఉన్న బ్యాగులో పెట్టిన రూ. 8 లక్షలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.






# సుపరిపాలనే లక్ష్యంగా పనిచేయాలి

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

అవినీతికి తావు లేకుండా సుపరిపాలనే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ట్రైనీ గ్రూప్1 అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లో ట్రైనీ గ్రూప్1 అధికారులలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తర్వాత బాధ్యత, పారదర్శకంగా, జవాబుదారిగా ఉద్యోగం చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. దేశంలో గ్రామీణ వ్యవస్థ చాలా పెద్దదన్నారు. గ్రామీణ ప్రజల ప్రగతే దేశ అభివృద్ధి అన్నారు. సేవల్లో తమ చుట్టూ ఉన్న వనరులను ఉపయోగించుకోవాలని తెలిపారు. విధి నిర్వహణలో టెక్నాలజీని కూడా ఉపయోగించాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డీవో శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

**సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి..**

ఈ నెల 19న మెదక్, 20న నర్సాపూర్ నియోజకవర్గాల్లో నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ ఆధ్వర్యంలో బంజారా సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల కోసం పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ను వేగవంతం చేయాలి

- **అడిషనల్ కలెక్టర్ మాధురి**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**




ఓటర్ల జాబితా సవరణ కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎలాంటి తప్పిదాలు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. బీఎల్ఓలు మ్యాపింగ్ ప్రక్రియకు క్షేత్రస్థాయిలో ఇంటింటికెళ్లి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈఆర్ఓలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమగ్రంగా పర్యవేక్షించి, వేగంగా పూర్తయ్యే విధంగా సహకరించాలని తెలిపారు.
వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేస్తామని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్ వో లు అంకితభావంతో పనిచేసేలా సంబంధిత మండలాల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, సివిల్ సప్లై డీఎం అంబాదాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయలలో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పట్టణ సమీపంలోని ఏడుపాయల వన దుర్గ అమ్మ వారి జాతరలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పలువురి ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక సారధి స్థానిక కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, జానపద గీతాలు, కోలాటం వంటి సంప్రదాయ కళా రూపాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. ప్రత్యేకంగా యువతుల బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అందరినీ ఆకర్షించింది. కళాకారులను సత్కరించారు.

**కళలతో చైతన్యం..**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీపీఆర్ఓ రామచంద్ర రాజు మాట్లాడుతూ కళలతో సమాజం చైతన్యమవుతుందన్నారు. కవులు, కళాకారులకు మెట్టినిల్లు మెదక్ జిల్లా అని పేర్కొన్నారు. కళలు భక్తి, సంస్కృతిని పరిరక్షించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. మంచి నైపుణ్యం గల కళాకారులు జిల్లాలో అనేక మంది ఉన్నారని, వారు చేసే సంస్కృతి, సాంప్రదాయాలు నేటి తరానికి కనువిందు చేస్తాయని తెలిపారు.

# పరిశ్రమలో అగ్నిప్రమాదం..

- **రసాయన పౌడర్ దగ్ధం**

గుమ్మడిదల పరిధిలోని పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గుమ్మడిదల హారికా డ్రగ్స్ పరిశ్రమలో ప్రమాదం జరిగింది. పరిశ్రమలో ముడి పదార్థం ఆరబెట్టే ఎంబీ 3 బ్లాక్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం జరిగినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఆ సమయంలో కార్మికులు ఆ బ్లాక్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే గుమ్మడిదల ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బొంతపల్లి పారిశ్రామికవాడ నుంచి 3 అగ్నిమాపక శకటాలు, నర్సాపూర్ నుంచి ఒక ప్రభుత్వ అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేశాయి. ప్రమాదం తీవ్రతకు పరిశ్రమ భవనం కూలిపోయింది. 420 కిలోల పీపీడీ రసాయన పౌడర్ దగ్ధమైనట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. సుమారుగా రూ. 12 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్

సంగారెడ్డి : ఓటరు జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేయాలన్నారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈఆర్వోలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమగ్రంగా పర్యవేక్షించి, వేగంగా పూర్తయ్యేలా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ. . జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేస్తామని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, తదితరులు పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
18.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**భారతదేశంలోని ప్రముఖ టాప్ 7 ఐటీ కంపెనీ**

**ఎమ్‌ఫాసిస్ (Mphasis) :** క్లౌడ్, కాగ్నిటివ్ సర్వీసెస్‌లో ప్రత్యేకత కలిగిన సంస్థ. BFSI (బ్యాంకింగ్, ఫైనాన్స్) రంగంలో బలమైన క్లయింట్ బేస్ ఉంది.




# తిరునాళ్లలో మద్యం ప్రసాదం..

- **జైహో కూటమి సర్కార్**

**ముద్ర న్యూస్:**



భక్తిభావంతో పులకించాల్సిన కోటప్పకొండ శివరాత్రి తిరునాళ్లు.. ఈసారి 'మద్యం' ఘాటుతో వార్తల్లోకి ఎక్కాయి. కలెక్టర్ మూడు రోజుల పాటు చుట్టుపక్కల మద్యం అమ్మకాలను కఠినంగా నిషేధిస్తే, క్షేత్రస్థాయిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే స్వయంగా సేల్స్ మెన్ అవతారమెత్తడం ఇక్కడ విశేషం. కోటి అనే హోంగార్డు తన డ్యూటీని గాలికి వదిలేసి, భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా మద్యం అమ్ముతూ అడ్డంగా దొరికిపోయాడు. "లెమన్ సోడాలు, మజ్జిగలు అమ్మే రోజులు పోయాయి.. కూటమి ప్రభుత్వంలో నేరుగా పోలీసులే మద్యం సరఫరా చేసే స్థాయికి ఎదిగారు!" అంటూ భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తూ ప్రభుత్వ యంత్రాంగమే మద్యం విక్రయాల్లో తలమునకలవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఇలాంటి పనులు చేస్తున్న హోంగార్డుపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# భూమిపై తొలి శాకాహారి..

- **30 కోట్ల ఏళ్ల నాటి పురాతన జీవి ఇదే!**

**ముద్ర న్యూస్:**

విశ్వంలో కోట్ల జీవరాశులున్నాయి. పరిస్థితులు, వాతావరణానికి అనుగుణంగా జీవనం సాగిస్తున్నాయి. తాజాగా అంతరిక్ష జీవులపైనా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో కెనడా శాస్త్రవేత్తలు కనుగొన్న చిన్న పుర్రె భూమి పరిణామ చరిత్రను మార్చేసింది. ఈ ఆవిష్కరణ శాకాహార జీవుల ఉద్భవాన్ని తెరపైకి తెచ్చింది.

**పురాతన శాకాహారి..**

నోవా స్కోటియాలో లభించిన టైరన్నోరోటర్ హెబెర్టీ తల ఎముక 307 మిలియన్ సంవత్సరాల నాటిది. ఈ చిన్న భూచర జీవి మొక్కలు, పీచు పదార్థాలతో బతికిందని స్పష్టమైంది. ఇది మాంసాహారి నుంచి మొక్కల ఆహారంలోకి మార్పును చూపిస్తుంది.

**విలక్షణ శరీర లక్షణాలు..**

ఫుట్‌బాల్ పరిమాణంలో ఉన్న ఈ జీవి పటిష్ఠ ఎముకలు, ప్రత్యేక ముక్కుతో నెలవైన మొక్కలను కోసేది. నోటిలో 'డెంటల్ బ్యాటరీస్' లాంటి దంతాలు పదార్థాన్ని రుద్దుతాయి. సీటీ స్కాన్‌లు దీని ఆహార శైలిని ధ్రువీకరించాయి. మైక్రోసార్ సమూహానికి చెందిన ఇది భూమిపై శాకాహార ఆధిపత్యాన్ని త్వరగా స్థాపించిందని పరిశోధన 'నేచర్ ఎకాలజీ'లో ప్రచురితమైంది.



# ఉగాది నాటికి టిమ్స్ సిద్ధం కావాలి

- **మంత్రి దామోదర రాజనర్సింహ**
- **పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**

**సంగారెడ్డి, హైదరాబాద్, ముద్ర ప్రతినిధి:**

ఉగాది నాటికి సనత్ నగర్ టిమ్స్ ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో సిద్ధం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ పనులను పర్యవేక్షించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ ఏర్పాట్లను పరిశీలించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్‌లో మెడికల్, ఫైర్, పొల్యూషన్ కంట్రోల్, వాటర్, ఎలక్ట్రిసిటీ, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి 24 గంటల పాటు నీరు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండవద్దన్నారు. అన్ని ఫ్లోర్లలో పూర్తి స్థాయిలో పరిశీలించాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు. పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా ఓపీ, ఫార్మసీ కౌంటర్లు ఉండాలన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ యంత్రాలు పూర్తి స్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలన్నారు. పేదలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పీసీబీ మెంబర్ సెక్రెటరీ రవి, వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జేఎండీ మయాంక్ మిటల్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.





# భువనగిరికి చేరిన అఖండ జ్యోతి

- **స్వాగతం పలికిన మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీవాణి, వైస్ చైర్ పర్సన్ మంజుల**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కోసం స్వామివారి 32వ అఖండ జ్యోతి యాత్ర మంగళవారం రాత్రి భువనగిరికి చేరుకుంది. డాల్ఫిన్ హోటల్ వద్ద భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్ పర్సన్ మంజుల వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా భువనగిరి నుంచి రథయాత్ర వెళ్తుందన్నారు. భువనగిరి ఇలవేల్పు శ్రీ లక్ష్మీనరసింహస్వామి అని తెలిపారు. స్వామి వారి ఆశీర్వాదం పట్టణ ప్రజలపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖండ జ్యోతి యాత్ర ప్రధాన చైర్మెన్ సద్ది వెంకట్ రెడ్డి, సహ చైర్మన్ డాక్టర్ బుచ్చి రెడ్డి, ప్రధాన కార్యదర్శి దిడ్డి బాలాజీ, పట్టణ చైర్మన్ పక్కిర్ కొండల్ రెడ్డి, ప్రజా సంబంధాల కన్వీనర్ గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యక్షులు శెట్టి బాలయ్య యాదవ్, దేవరకొండ నరసింహాచారి, ఎన్విడి నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి అధ్యక్షులు పలుగుల ఆగేశ్వరరావు, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ సుమంత్ రెడ్డి, వాసవి క్లబ్ అధ్యక్షులు బిజ్జల మహేష్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పాదరాజు శ్యామ్ మోహన్ రావు, ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు ఇటిక్యాల లావణ్య, రెడ్ క్రాస్ ప్రతినిధులు చంద్రశేఖర్, చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఉపాధ్యక్షురాలు పెరంబుదూరు స్పందన, నాయకులు రత్నపురం శ్రీశైలం, బెండే లాల్ రాజ్, చల్లగురువుల రఘుబాబు పాల్గొన్నారు.

# ట్రావెల్స్ బస్సులో ప్రేమ జంట అరాచకం..

- **అడ్డుకున్న డ్రైవర్ పై దాడి**

**ముద్ర న్యూస్:**

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును 'ఓయో' రూమ్‌గా మార్చుకోవాలని చూసిన ఒక ప్రేమజంట.. చివరకు డ్రైవర్‌పై దాడి చేసి పోలీసు కేసు వరకు వెళ్లిన ఘటన మచిలీపట్నంలో కలకలం రేపింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా నిబంధనలు అమలు చేయాలని చూసిన డ్రైవర్‌పై ఆ జంట విచక్షణారహితంగా దాడికి పాల్పడింది.



**అసలేం జరిగింది?**

హైదరాబాద్‌కు చెందిన ప్రేమజంట మచిలీపట్నం వెళ్లేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సులో టికెట్లు బుక్ చేసుకున్నారు. అయితే స్లీపర్ బస్సుల్లో అపరిచిత వ్యక్తులైన స్త్రీ, పురుషులకు పక్కపక్క సీట్లు కేటాయించరనే నిబంధనను దాటేసేందుకు యువకుడు క పథకం వేశాడు. టికెట్ బుకింగ్ సమయంలో తనను కూడా యువతిగానే చూపిస్తూ ఫిమేల్ కోటాలో రెండు సీట్లు బుక్ చేశాడు.

**గుట్టు రట్టు చేసిన డ్రైవర్..**

బస్సు బయలుదేరిన తర్వాత టికెట్లు తనిఖీ చేస్తున్న సమయంలో డ్రైవర్ అసలు విషయాన్ని గుర్తించాడు. పక్కపక్క సీట్లలో యువతీ యువకులు ఉండటం, ఐడీ కార్డులు పరిశీలించినప్పుడు యువకుడు తప్పుడు వివరాలతో బుక్ చేశాడని తెలియడంతో డ్రైవర్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. నిబంధనల ప్రకారం వేర్వేరు లింగాల వారు పక్కపక్కనే ప్రయాణించడం కుదరదని స్పష్టం చేయడంతో జంట వాగ్వాదానికి దిగింది. ఇతర ప్రయాణికులు నచ్చజెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది.

**రెచ్చగొట్టిన ప్రియురాలు..**

బస్సు మచిలీపట్నంలోని చిలకలపూడి సెంటర్‌కు చేరుకోగానే అసలు కథ మొదలైంది. ప్రయాణంలో తమను అడ్డుకున్నాడన్న కోపంతో యువతి తన ప్రియుడిని రెచ్చగొట్టింది. ఆమె మాటలతో ఆవేశానికి లోనైన యువకుడు, బస్సు దిగగానే డ్రైవర్‌పై భౌతిక దాడికి దిగాడు. విచక్షణారహితంగా కొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

**పోలీసుల రంగ ప్రవేశం..**

బాధిత డ్రైవర్ ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనతో పాటు విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్ పై దాడి చేసినందుకు సదరు యువకుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



# నాలుగు వారాల్లో లొంగిపోవాలి

- **ప్రత్యూష మృతి కేసులో సుప్రీం కోర్టు తీర్పు**
- **హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం**

**ముద్ర న్యూస్:**

సుమారు ఇరువై ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీం కోర్టు తుది తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో హైకోర్టు విధించిన జైలు శిక్షను సవాలు చేస్తూ నిందితుడు సిద్దార్థ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టు నిర్ణయాన్ని నిలబెట్టిన కోర్టు, నాలుగు వారాల్లో లొంగిపోవాలని నిందితున్ని ఆదేశించింది.

కేసు దర్యాప్తు చేపట్టిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ నిందితుడిపై ఆత్మహత్యాయత్నం, ఆత్మహత్యకు ప్రేరేపణ ఆరోపణల కింద అభియోగాలు మోపింది. తొలుత హైదరాబాద్ మెట్రోపాలిటన్ కోర్టు ఐదేళ్ల కారాగార శిక్ష విధించింది. అప్పీల్‌లో విచారించిన హైకోర్టు శిక్షను రెండేళ్లకు తగ్గిస్తూ జరిమానా కూడా విధించింది. ఈ తీర్పును మరోసారి సవాలు చేసినప్పటికీ సుప్రీం కోర్టు ఉపశమనం కల్పించలేదు. ప్రత్యూష 2000 ప్రాంతంలో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టి రాయుడు, కలుసుకోవాలని వంటి చిత్రాల్లో నటించారు.

2002 ఫిబ్రవరి 23న రాత్రి విషప్రయోగం చేసిన స్థితిలో ఆమె, సిద్దార్థ ఆసుపత్రిలో చేరారు. మరుసటి రోజు ప్రత్యూష మృతి చెందగా, సిద్దార్థ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కూల్ డ్రింక్‌లో పురుగు మందు కలిపి తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. వైద్యుల బృందం ఆమెపై లైంగిక దాడి జరగలేదని స్పష్టం చేసింది. అయితే ఆత్మహత్యకు ప్రేరేపించాడనే ఆరోపణలపై సిద్దార్థను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసిన ఈ కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. తాజా తీర్పుతో ఈ వ్యవహారం న్యాయపరంగా ముగింపు దశకు చేరుకుంది.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం

- **మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక**
- **అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి చర్యలు**
- **యుద్ధప్రాతిపదికన లబ్ధిదారుల ఎంపిక**
- **మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ సమీక్ష**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఈ పథకం ద్వారా పేదలకు వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లను నిర్మించి అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలు తమ జీవనోపాధికి ఇబ్బంది లేకుండా అదే ప్రాంతంలో నివసించేందుకు అనుకూలంగా 5 నుంచి 10 అంతస్తుల భవనాలు నిర్మించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇప్పటికే నిర్మించి ఖాళీగా ఉన్న ఇళ్లపై సమీక్ష చేసి, బోగస్ లబ్ధిదారులను తొలగించి అర్హులైన పేదలకు కేటాయించనున్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేయడానికి లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించనున్నారు.

మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో సుమారు 28 వేల మందికి ఈ నెల చివరిలోగా ఇళ్ల మంజూరు పత్రాలు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు పొందారు. అలాగే 2BHK కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. ఇక ఆర్‌ఆర్‌ఆర్‌ఓఆర్‌ఆర్ మధ్య ప్రాంతంలో మధ్యతరగతి ప్రజల కోసం అఫోర్డబుల్ హౌసింగ్ పాలసీ కింద ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఈ చర్యలతో నగర పరిధిలో పేదల గృహ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.



భారతదేశంలోని ప్రముఖ టాప్ 8 ఐటీ కంపెనీ

పెర్సిస్టెంట్ సిస్టమ్స్ : సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డిజిటల్ ఇంజినీరింగ్‌లో నిపుణులు. AI, క్లౌడ్, డేటా సేవల్లో వేగంగా పెరుగుతోంది.



# ఏఐ విప్లవం : రెండేళ్లలో ఆఫీస్ ఉద్యోగాలు ఉండవు..

**ముద్ర డెస్క్ :**



సాంకేతిక పరిజ్ఞానం ఎప్పుడూ పాత పద్ధతులను తుడిచిపెట్టి కొత్త దారులను వేస్తుంది. కానీ ప్రస్తుతం మనం చూస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవం అసాధారణమైనది. ఇది కేవలం యంత్రాల వేగాన్ని పెంచడం లేదు.. మనిషి ఆలోచనా సామర్థ్యాన్ని, సృజనాత్మకతను సవాలు చేస్తోంది. రాబోయే 24 నెలల్లో కార్పొరేట్ ఆఫీస్ ఉద్యోగాల స్వరూపం పూర్తిగా మారిపోనుందన్న హెచ్చరికలు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

**ముంచుకొస్తున్న పెనుమార్పు.. హెచ్చరికల్లో నిజమెంత..?**

అమెరికన్ ఎంట్రప్రెన్యూర్ ఆండ్రూ యాంగ్ విశ్లేషణ ప్రకారం.. ఇది ఒక నిశ్శబ్ద మార్పు కాదు.. ఒక సునామీ. లాయర్లు, కోడర్లు, డేటా అనలిస్టులు వంటి 'వైట్ కాలర్' ఉద్యోగాలు ఏఐ ధాటికి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. గతంలో శారీరక శ్రమ చేసేవారికి మాత్రమే ముప్పు ఉండేది.. కానీ ఇప్పుడు మేధోపరమైన పనులు చేసే 'మిడిల్ మేనేజర్లు' కూడా తమ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజులు పట్టే విశ్లేషణలను ఏఐ సెకన్లలో పూర్తి చేస్తుంటే.. కంపెనీలు భారీ జీతాలతో ఉద్యోగులను ఎందుకు కొనసాగిస్తాయి? అన్నది అసలు ప్రశ్న. వినోద్ ఖోస్లా వంటి దిగ్గజాలు అంచనా వేస్తున్నట్లుగా.. రాబోయే ఐదేళ్లలో ఐటీ, బీపీఓ రంగాలు కుంచించుకుపోయే అవకాశం ఉంది. ఇది కేవలం ఉద్యోగాల కోత మాత్రమే కాదు, రియల్ ఎస్టేట్ నుండి నగరాల ఆర్థిక వ్యవస్థ వరకు గొలుసుకట్టు ప్రభావాన్ని చూపుతుంది. ఆఫీసులు ఖాళీ అయితే వాటిపై ఆధారపడిన రవాణా, ఆహారం, అనుబంధ రంగాలు కూడా దెబ్బతింటాయి.

**భారత్‌కు సవాలు.. అంతకు మించిన అవకాశం..**

ఐటీ సేవలపై అత్యధికంగా ఆధారపడిన భారత్ వంటి దేశాలకు ఇది ఒక క్లిష్ట సమయం. ఒకప్పుడు 'ప్రపంచానికి బ్యాక్ ఆఫీస్'గా ఉన్న భారత్ ఇప్పుడు తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంది. సేవలందించే స్థాయి నుండి ఏఐ ఉత్పత్తులను సృష్టించే స్థాయికి ఎదగడమే మన ముందున్న ఏకైక మార్గం. ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వంటి వేదికలు ఈ దిశగా భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టే వ్యూహాలను రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

**నాణేనికి మరోవైపు.. ఆశాజనకమైన మార్పులు**

ఏఐ అంటే కేవలం భయం మాత్రమే కాదు.. ఇది సామాన్యుడికి విద్యను, నాణ్యమైన వైద్యాన్ని అతి తక్కువ ధరకే లేదా ఉచితంగా అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. నైపుణ్యం ఉన్నవారికి కొత్త తలుపులు తెరుచుకుంటాయి. సంప్రదాయ డిగ్రీల కంటే 'నిరంతర అభ్యసనం'..ఏఐతో కలిసి పనిచేసే నైపుణ్యం ఉన్నవారే రేపటి విజేతలు.

**సంక్షోభమా.. పరిణామమా?**

ఉద్యోగాలు పూర్తిగా పోవు.. కానీ ఉద్యోగ స్వభావం మారుతుంది. ఇది ఒక రకమైన 'సృజనాత్మక విధ్వంసం'. మార్పును చూసి భయపడటం కంటే.. దానికి అనుగుణంగా మనల్ని మనం మలచుకోవడమే విజ్ఞత. ప్రభుత్వం, విద్యాసంస్థలు, వ్యక్తిగతంగా ప్రతి ఉద్యోగి కొత్త స్కిల్స్ నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలి. ఏఐ మిమ్మల్ని భర్తీ చేయదు, కానీ ఏఐని వాడటం తెలిసిన వ్యక్తి మిమ్మల్ని భర్తీ చేస్తాడు.

# భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లు

- **తీర్థయాత్రలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు**

**ముద్ర, హైదరాబాద్ :**

తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే భక్తుల కోసం భారతీయ రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మార్చి 21 నుంచి మే 21 వరకు నాలుగు ప్రత్యేక ప్యాకేజీలను “భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు” ద్వారా హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నట్లు IRCTC టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ తెలిపారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన యాత్రల వివరాలను వెల్లడించారు.

**ప్యాకేజీ వివరాలు**

మొదటి ప్యాకేజీగా దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగంతో మార్చి 21 నుంచి 28 వరకు జరుగుతుంది. తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు వంటి పవిత్ర ప్రాంతాలను ఈ యాత్రలో సందర్శిస్తారు. టికెట్ ధరలు సాధారణ క్లాస్‌కు రూ.14,700, 3 ఏసీకి రూ.22,300, 2 ఏసీకి రూ.28,700గా నిర్ణయించారు. రెండవ ప్యాకేజీ సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర ఏప్రిల్ 14 నుంచి 24 వరకు ఉంటుంది. ఉజ్జయిని, ద్వారక, సోమనాథ్, పూణే, నాసిక్, ఔరంగాబాద్ వంటి ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రాలను దర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. టికెట్ ధరలు రూ.17,600 నుంచి రూ.34,600 వరకు ఉన్నాయి. మూడవ ప్యాకేజీ అయోధ్యకాశీబైద్యనాథ్ ధామ్ యాత్ర ఏప్రిల్ 28 నుంచి మే 5 వరకు కొనసాగుతుంది. పూరి, కోణార్క్, వారణాసి, అయోధ్య, ప్రయాగ్రాజ్ వంటి పవిత్ర ప్రదేశాలను సందర్శించే ఈ యాత్రకు రూ.16,700 నుంచి రూ.34,100 వరకు చార్జీలు ఉంటాయి. నాలుగవ ప్యాకేజీగా హరిద్వార్‌మాతా వైష్ణోదేవిరిషికేశ్ యాత్ర మే 12 నుంచి 21 వరకు నిర్వహిస్తారు. మధుర, బృందావనం, వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేశ్ ప్రాంతాలు ఇందులో భాగం. టికెట్ ధరలు రూ.16,500 నుంచి రూ.33,400 వరకు ఉన్నాయి.

**ప్రయాణ సౌకర్యాలు..**

ఈ ప్యాకేజీల్లో రైలు, బస్సు, హోటల్ వసతి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలు అందిస్తారు. అదనపు ఖర్చు లేకుండా దర్శనాలు, ప్రయాణ బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రతి రైలులో సుమారు 705 మంది ప్రయాణికులు ఉండగా, ప్రతి 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు సేవలు అందిస్తారు. భద్రత కోసం సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు ఉంటారు.

**ఎయిర్ ప్యాకేజీలు కూడా అందుబాటులో..**

హైదరాబాద్ నుంచి దేశీయంగా ఒడిశా (5 రోజులు), హిమాచల్ & పంజాబ్ (7 రోజులు), కర్ణాటక (6 రోజులు), అయోధ్యకాశీ (7 రోజులు), అండమాన్ నికోబార్ (6 రోజులు), కాశ్మీర్ (6 రోజులు) వంటి ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. అలాగే అంతర్జాతీయంగా నేపాల్ (7 రోజులు), శ్రీలంక (6 రోజులు) టూర్ ప్యాకేజీలు ప్రకటించారు.

**-బుకింగ్ వివరాలు..**

టికెట్లు బుక్ చేసుకోవాలనుకునే వారు 9701360701, 9281030727, 9281030759 నంబర్లను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్స్ ప్రశాంత్, శ్రీకాంత్, ట్రావెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రజా పాలన

- **మూసాపేటలో 250మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**

ముద్ర, కూకట్‌పల్లి : పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతమైన ప్రజా పాలనను అందిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ నేత బండి రమేష్ అన్నారు. మంగళవారం మూసాపేట ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి 250మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందేలా సీఎం రేవంత్ రెడ్డి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూతను, కుట్టు మిషన్ల వంటి పరికరాలను మహిళలు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

# స్వదేశీ డిజైన్, మానవ కేంద్రిత సాంకేతికతపై దృష్టి సారించాలి : కలెక్టర్

- **గండిపేట సీబీఐటీలో జాతీయ సాంకేతిక ఉత్సవం 'సుధీ–2026' ప్రారంభం**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి / బండ్లగూడ :**




రంగారెడ్డి జిల్లా గండిపేటలోని చైతన్య భారతి సాంకేతిక విద్యాసంస్థ (సీబీఐటీ)లో జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక ఉత్సవం 'సుధీ-2026'ను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవిష్కరణలు, రూపకల్పనలు సమాజ అవసరాలను తీర్చే విధంగా ఉండాలని తెలిపారు. సాంకేతిక పరిష్కారాలు కేవలం సిద్ధాంత పరిమితిలోనే కాకుండా, అమలు సాధ్యమైనవి, వ్యయపరంగా అందుబాటులో ఉండేలా, స్థిరత్వంతో కూడినవిగా రూపుదిద్దుకోవాలని సూచించారు. ఒక ప్రాంతంలో ఉపయోగపడే సాంకేతికత భౌగోళిక, సామాజిక మరియు వనరుల పరిమితుల కారణంగా మరో ప్రాంతంలో అనుకూలంగా ఉండకపోవచ్చని ఆమె తెలిపారు. అందువల్ల స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆవిష్కరణలు చేయాలని సూచించారు. భారతీయ అవసరాలు, విలువలకు అనుగుణంగా రూపొందించే స్వదేశీ రూపకల్పన అవసరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. “భారతదేశం కోసం రూపకల్పన” అనే భావనతో యువత ముందుకు రావాలని, స్వావలంబన మరియు సుస్థిర అభివృద్ధికి దోహదపడే సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. తాను అమలు చేసిన పునర్వినియోగ ప్లాస్టిక్ పలకల తయారీ, డ్రోన్ ఆధారిత ప్రజా సేవల కార్యక్రమాలను ఉదాహరణగా పేర్కొంటూ, ఏ ఆవిష్కరణ విజయవంతం కావాలంటే భూస్థాయి పరీక్షలు, ప్రజల ఆమోదం, అనుకూలతతో కూడిన నిరంతర కృషి అవసరమని తెలిపారు. కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై మాట్లాడుతూ, సాంకేతికత మనుషులను భర్తీ చేయదని, అయితే నిరంతర అభ్యాసం మరియు నైపుణ్యాల మెరుగుదల అవసరమన్నారు. మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు జీవితాంతం నేర్చుకునే ధోరణిని అలవర్చుకోవాలని సూచించారు. సాంకేతిక అభివృద్ధిలో నైతిక విలువలు, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. సాంకేతికత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఉండాలని తెలిపారు. అనంతరం 'సుధీ-2026' స్మారక గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించిన సీబీఐటీ యాజమాన్యం, అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య , సీబీఐటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.వి.నరసింహులు, ఇన్నోమైండ్స్ డిజిటల్ అండ్ ఐపీ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్ మేడూరి, అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి కేసీఆర్ : ఎమ్మెల్యే

**ముద్ర, కాప్రా :**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి అవిశ్రాంతంగా పోరాడి, ప్రజల స్వాభిమానాన్ని సంపాదించుకున్న మహోన్నత నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉప్పల్, నాచారం, కాప్రా, మల్లాపూర్ ,కుషాయిగూడ ,చర్లపల్లి ప్రాంతాలలో నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మల్లాపూర్ నోమ సర్కిల్ సమీపంలో మొక్కల నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ తో పాటు భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించాలనే సంకల్పంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలలో మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ లో దేవేందర్ రెడ్డి, కొత్త రామారావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో..**

బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు పుట్టినరోజు వేడుకలను మల్కాజిగిరి, నేరేడుమెట్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు.వేడుకల్లో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, పరుశురామిరెడ్డి స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

**కూకట్‌పల్లిలో..**

హైదరాబాద్(కూకట్‌పల్లి) : మాజీ సీఎం కేసీఆర్ 72వ జన్మదినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరాం కృష్ణారావు, బోయినపల్లి డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పునః సమీక్షించాలి

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి :**

ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను) సమీక్షించి మరింత పక్కగా అమలుపర్చేలా ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చల్లో నివేదించాలని రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రామారావు, శ్రీనిష్ కుమార్ తమ కేంద్ర కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఈహెచ్ఎస్ పై జిల్లా అధికారులు, ఇతరుల నుండి అందిన ప్రతిపాదనల ఆధారంగా టీజీవో కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈహెచ్ఎస్ పైన ప్రభుత్వంతో రాబోయే చర్చలలో తమ వినతులను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలను నివేదించాలని వారు కోరారు.




# 9 మంది పాస్.. ఒక్కరు ఫెయిల్!

- **మున్సిపల్ పోరులో 'మహబూబ్ నగర్' ఎమ్మెల్యేల జోరు**
- **నారాయణ పేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి ఒక్కరే ఫెయిల్**
- **8మంది కాంగ్రెస్, ఒక్క బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే సక్సెస్**
- **మున్సిపాలిటీ ఎన్నికల్లో సత్తా చాటిన ఆయా నియోజకవర్గా ల ఎమ్మెల్యే లు**
- **జిల్లా లో ఒకే ఒక మేయర్ పదవి దక్కించుకోవడం లో ఎమ్మెల్యే యెన్నం సక్సెస్ మంత్రం**
- **ఉమ్మడి జిల్లా లో ని మున్సిపాలిటీ లలో సఫలమైన మంత్రులు, ఎమ్మెల్యేలు**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని 10నియోజకవర్గాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ ఎమ్మెల్యే లు తమ సత్తాచాటి కాంగ్రెస్ కి పూర్వ వైభవం తెచ్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉన్నా జడ్చర్ల, అచ్చంపేట నియోజకవర్గంలోని మున్సిపాలిటీలకు ఎన్నిక జరగలేదు. ఇక్కడి మున్సిపాలిటీ పాలక గడువు ఇంకా ముగియక పోవడం తో ఎన్నిక జరగలేదు. మిగతా 10నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లో 8మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక బీఆర్ఎస్ ఎమ్మెల్యే తమ అభ్యర్థులను గెలిపించు కోవడం లో సక్సెస్ అయ్యారు. కానీ అధికార పార్టీకి చెందిన నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాత్రం తన పరిధి లోని మున్సిపాలిటీని దక్కించుకోలేక పోయింది. ఇక్కడి మున్సిపాలిటీపై కాషాయ జెండా రెపరెపలాడింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండి బీజేపీ గెలవడంతో ఎమ్మెల్యే పర్ణిక పై విమర్శలు వస్తున్నాయి. కానీ ఆమె కాలుకు నొప్పి ఉండడంతో వైద్యులు విశ్రాంతి తీసుకోమని చెప్పడంతో ఆమె మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రచారం కూడా చేయలేదు. ఆమె హైదరాబాద్ కు పరిమితం కావడంతో ఆమె మేనమామ, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఈ ఎన్నికల్లో అన్నీ తానై చూసుకున్నా మున్సిపాలిటీ ఎన్నికల్లో బోల్తా కొట్టారు. ఈ స్థానం బీజేపీకి దక్కడంతో ఎమ్మెల్యే పై కాంగ్రెస్ అధిష్టానం గుర్రుగా ఉన్నట్లు సమాచారం. గత ఎంపీ ఎన్నికల్లో నారాయణ పేట నియోజకవర్గంలో బీజేపీకి అత్యంత మెజారిటీ వచ్చింది. ఈ విషయం దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ ఎన్నికల్లో పనిచేసి ఉంటే కాంగ్రెస్ కు అనుకూలంగా ఫలితం ఉండేదని పార్టీ శ్రేణులు అంటున్నారు. ఈ ఓటమితో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పర్ణిక కొంత నిరాశ కు గురయ్యారు.

**ఇద్దరు మంత్రులు సక్సెస్..**

ఉమ్మడి జిల్లా కు చెందిన ఇద్దరు మంత్రులు మున్సిపాలిటీ ఎన్నికల్లో పూర్తిగా సక్సెస్ అయ్యారు. కొల్లాపూర్లో మంత్రి జూపల్లి కృష్ణా రావు ఇక్కడి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ను విజయ తీరాలకు చేర్చారు. మరో మంత్రి మక్తల్ కు నియోజకవర్గానికి చెందిన వాకిటి శ్రీహరి తన పరిధి లో మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. మక్తల్, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ విజయం సాధించడంలో మంత్రి పాత్ర అమోఘమైంది. అమరచింతలో 10 మున్సిపల్ స్థానాల్లో కాంగ్రెస్ కి 3, బీఆర్ఎస్ కు 3, బీజేపీకి 3, ఒకటి సిపిఐకి వచ్చింది. ఏ పార్టీ కి మెజారిటీ రాకపోవడం తో అన్నీ పార్టీలు ఇతర పార్టీల అభ్యర్థులపై ఫోకస్ పెట్టారు. ఇక్కడే మంత్రి శ్రీహరి చక్రం తిప్పారు. బీ ఆర్ ఎస్ చెందిన అభ్యర్థిని కాంగ్రెస్ కి మద్దతు ప్రకటించింది. దీంతో మంత్రి ఎక్స్ అఫిషియో ఓటు తో కాంగ్రెస్ కు విజయం దక్కింది. బీఆర్ఎస్ నుంచి వచ్చి కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చిన అభ్యర్థిని కి చైర్ పర్సన్ పదవి దక్కింది. మంత్రి పరిధిలోని మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ కు విజయం తెచ్చిపెట్టిన వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ అధిష్టానం నుంచి ప్రశంస లు అందుకొన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే గౌనినోళ్ల మధుసూదన్ రెడ్డి తన పరిధి లోని దేవరకద్ర, భూత్పూర్, కొత్తకోట మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. మూడు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కు కట్టబెట్టడం లో ఇక్కడి ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తన పరిధిలోని వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ కి విజయం తెచ్చిపెట్టారు. ఇక్కడ కాంగ్రెస్ లో ఉన్న అసమ్మతి ని ఎదురుక్కొని బలంగా నిలబడి కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో తన పాత్ర పోషించి సఫలీకృతులయ్యారు. గద్వాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ అని చెప్పుకుంటూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి విజయం పొందారు. కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా ఉండి వారి గెలుపులో ముఖ్య పాత్ర పోషించారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ నియోజకవర్గానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మూడు మున్సిపాలిటీ లలో రేవంత్ రెడ్డి ప్రచారం చేయకున్నా... పార్టీ శ్రేణులు బాగా కష్ట పడ్డారు. ఇందులో సీఎం సోదరులు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. మహబూబ్ నగర్లో మేయర్ పదవి కాంగ్రెస్ పార్టీకి దక్కడంలో ఇక్కడి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య పాత్ర పోషించారు. మేజిక్ ఫిగర్ కు రెండు స్థానాలు తక్కువగా ఉన్నా స్వతంత్రుల, ఎంఐఎం ల సహకారంతో మేయర్ పీఠం దక్కించుకున్నారు. నాగర్ కర్నూల్లో ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి తన పరిధిలోని నాగర్ కర్నూల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టడంలో తీవ్రంగా కష్టపడ్డారు. అలంపూర్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు తన పరిధిలోని అలంపూర్ మున్సిపాలిటీపై గులాబీ జెండా రెపరెపలాడించారు. ఎవరికి వారుగా ఎమ్మెల్యే లు తమ పరిధిలోని మున్సిపాలిటీ లను దక్కించుకోవడంలో సక్సెస్ అయ్యారు.

భారతదేశంలోని ప్రముఖ టాప్ 9 ఐటీ కంపెనీ

కోఫోర్జ్ (Coforge) : డిజిటల్ సేవలు, క్లౌడ్, ఆటోమేషన్‌లో ప్రత్యేకత కలిగిన సంస్థ. ట్రావెల్, ఫైనాన్స్ రంగాల్లో బలమైన క్లయింట్ నెట్‌వర్క్ ఉంది.










# టీమిండియాలో మార్పులు ఖాయం

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగిన భారత జాతీయ క్రికెట్ జట్టు టోర్నీలో వరుస విజయాలతో దూసుకెళ్తోంది. గ్రూప్‌ఎలో అమెరికా, నమీబియా జట్లపై గెలిచిన భారత్, ఆపై చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జాతీయ క్రికెట్ జట్టుపై 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో లీగ్ దశలో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సూపర్ 8కు అర్హత సాధించింది.గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌గా భారత్ బుధవారం (ఫిబ్రవరి 18) నెదర్లాండ్స్ జట్టుతో తలపడనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఈ మ్యాచ్‌కు వేదిక. ఇప్పటికే తదుపరి దశకు చేరుకున్న నేపథ్యంలో జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉందని సమాచారం. ఓపెనర్‌గా అభిషేక్ శర్మ రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయినప్పటికీ అతడిపై మేనేజ్‌మెంట్ విశ్వాసం కొనసాగించే అవకాశముంది. ఇషాన్ కిషన్ స్థానం మాత్రం సురక్షితంగా కనిపిస్తోంది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో తిలక్ వర్మ, శివం దూబే, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడిన ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వొచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. అతని స్థానంలో అర్‌ష్‌దీప్ సింగ్‌కు అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. అలాగే కుల్దీప్ యాదవ్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే ఆలోచనలో జట్టు మేనేజ్‌మెంట్ ఉందని తెలుస్తోంది. గాయంతో కొంతకాలం దూరంగా ఉన్న సుందర్ ఇటీవల పూర్తిగా ఫిట్‌నెస్ సాధించడంతో ఈ మ్యాచ్‌లో అతడికి అవకాశమివ్వొచ్చని భావిస్తున్నారు.

**నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌కు భారత జట్టు (అంచనా):**

ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివం దూబే, రింకూ సింగ్, అక్షర్

# వరుణుడి దెబ్బకు ఆసీస్ ఔట్...

## జింబాబ్వే సూపర్ 8లోకి

ICC Men's T20 World Cupలో ఆస్ట్రేలియా జట్టుకు అనూహ్య షాక్ తగిలింది. పల్లెకెలె వేదికగా జరగాల్సిన ఐర్లాండ్ - జింబాబ్వే మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దు కావడంతో ఆస్ట్రేలియా జాతీయ క్రికెట్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది.ఈ మ్యాచ్ ఫలితం ఆసీస్‌కు కీలకంగా మారింది. జింబాబ్వే జట్టు ఓడితేనే ఆస్ట్రేలియాకు సూపర్ 8 ఆశలు నిలిచేవి. కానీ వర్షం తగ్గకపోవడంతో టాస్ కూడా వేయలేదు. మ్యాచ్‌ను రద్దు చేసి ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించడంతో జింబాబ్వే జాతీయ క్రికెట్ జట్టు ఐదు పాయింట్లతో గ్రూప్ నుంచి సూపర్ 8 దశకు చేరింది.ఈ టోర్నీలో ఆస్ట్రేలియా జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేదు. జింబాబ్వే జట్టు, శ్రీలంక జట్టు చేతిలో పరాజయాలు ఎదురవడంతో నాకౌట్ అవకాశాలు క్లిష్టమయ్యాయి. కీలక బౌలర్ల గైర్హాజరు, టాప్ ఆర్డర్ వైఫల్యం జట్టును దెబ్బతీశాయి. చివరి మ్యాచ్‌లో గెలిచినా పాయింట్ల పరంగా వెనుకబడటంతో ఆస్ట్రేలియా జట్టు మూడో స్థానానికే పరిమితమైంది. ఇక జింబాబ్వే జట్టు మాత్రం ఈసారి నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. గత ఎడిషన్‌లో అర్హత సాధించలేక పోయిన ఆ జట్టు, ఈసారి మెరుగైన ఆటతీరు ప్రదర్శించి సూపర్ 8లో అడుగుపెట్టడం విశేషం. వరుణుడి ప్రభావం గ్రూప్ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది.







# టీ20 వరల్డ్ కప్‌లో భారీ షాక్

**గ్రూప్ దశలోనే ఆస్ట్రేలియా ఔట్**

ICC Men's T20 World Cup 2026లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. టోర్నీ చరిత్రలో తొలిసారిగా ఆస్ట్రేలియా జాతీయ క్రికెట్ జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. బలమైన జట్టుగా భావించిన ఆస్ట్రేలియా ఈసారి సూపర్ 8 దశకు కూడా చేరకుండానే బయటపడడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది.జింబాబ్వే -ఐర్లాండ్ మధ్య జరగాల్సిన కీలక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఫలితంగా ఆ రెండు జట్లకు చెరో పాయింట్ లభించింది. మూడు మ్యాచ్‌లలో రెండింటిలో గెలిచిన జింబాబ్వే పాయింట్ల పట్టికలో మెరుగైన స్థితిలో నిలిచింది. మరోవైపు ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క విజయంతోనే పరిమితమై, నెట్ రన్‌రేట్ పరంగా కూడా వెనుకబడింది. దీంతో కనీస అర్హత సాధించకుండానే టోర్నీ నుంచి తప్పుకుంది. ఇక గ్రూప్ దశలో అద్భుత ప్రదర్శన చేసిన భారత జాతీయ క్రికెట్ జట్టు వరుసగా మూడు విజయాలతో సూపర్ 8కు అర్హత సాధించింది. అదే విధంగా శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టు, వెస్టిండీస్ జాతీయ క్రికెట్ జట్టు, ఇంగ్లాండ్ జాతీయ క్రికెట్ జట్టు, దక్షిణాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు జట్లు తమ తమ గ్రూపుల్లో మెరుగైన ప్రదర్శనతో తదుపరి దశకు చేరుకున్నాయి. టోర్నీ నుంచి ఇప్పటికే నేపాల్ జాతీయ క్రికెట్ జట్టు, ఇటలీ జాతీయ క్రికెట్ జట్టు, స్కాట్లాండ్ జాతీయ క్రికెట్ జట్టు, అఫ్గానిస్తాన్ జాతీయ క్రికెట్ జట్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ క్రికెట్ జట్టు, కెనడా జాతీయ క్రికెట్ జట్టు జట్లు ఎలిమినేట్ అయ్యాయి. ఈ అనూహ్య ఫలితాలతో టోర్నీ మరింత ఉత్కంఠభరితంగా మారింది.

# గుడ్‌న్యూస్...

## ఆస్ట్రేలియా సిరీస్‌కు ప్రతీకా రావల్ తిరిగి జట్టులోకి

వన్డే ప్రపంచకప్ విజేతగా విదేశీ పర్యటనలో ఉన్న భారత మహిళల జట్టుకు శుభవార్త అందింది. గాయంతో మూడు నెలలకు పైగా ఆటకు దూరమైన ఓపెనర్ ప్రతీకా రావల్ మళ్లీ జట్టులో చేరనుంది. తాజాగా ఫిట్‌నెస్ సాధించిన ఆమెకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనుమతి ఇవ్వడంతో, ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేశారు. ప్రపంచకప్ లీగ్ దశలో చివరి మ్యాచ్ సందర్భంగా పాదం గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్న ప్రతీకా, రిహాబిలిటేషన్ పూర్తి చేసి మ్యాచ్ ఫిట్‌గా మారింది. నిలకడైన ప్రదర్శనతో స్వల్ప కాలంలోనే ఓపెనర్‌గా స్థానం దక్కించుకున్న ఆమె పునరాగమనం జట్టుకు బలం కానుంది. టీ20 సిరీస్ ముగిసేలోపు ఆమె జట్టుతో కలవనుండగా, టెస్టు స్క్వాడ్‌లో కూడా చోటు దక్కింది. మార్చి 6న పెర్త్‌లో ప్రారంభమయ్యే టెస్టులో ఆమె ఆడే అవకాశాలు ఉన్నాయి. కంగారూ నేలపై ప్రతీకా ప్రదర్శన ఎలా ఉంటుందో ఆసక్తిగా మారింది.

**భారత మహిళల వన్డే జట్టు:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, ప్రతీకా రావల్, దీప్తి శర్మ, రీచా ఘోష్ (వికెట్ కీపర్), ఉమా ఛెత్రీ (వికెట్ కీపర్), కష్వీ గౌతమ్, అమన్‌జోత్ కౌర్, రేణుకా సింగ్, శ్రీ చరణి, వైష్ణవీ వర్మ, క్రాంతి గౌడ్, స్నేహ్ రానా.

# కెనడాపై కివీస్ దూకుడు...

**• సూపర్ 8లోకి న్యూజిలాండ్**

టీ20 వరల్డ్‌కప్‌లో కెనడాతో జరిగిన గ్రూప్-డీ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో కివీస్ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. టాస్ గెలిచిన కెనడా జాతీయ క్రికెట్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. భారతీయ సంతతికి చెందిన యువరాజ్ సమ్రా అద్భుత శతకంతో మెరిశాడు. 65 బంతుల్లో 110 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అతని దూకుడు బ్యాటింగ్‌తో కెనడా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు సాధించింది. తొలి వికెట్‌కు సమ్రా-బజ్వా జోడీ శతక భాగస్వామ్యం నమోదు చేసింది.174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆరంభంలో ఒక వికెట్ కోల్పోయినా, తరువాత రచ్చిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ చెలరేగారు. రవీంద్ర 59, ఫిలిప్స్ 77 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును 15.1 ఓవర్లలో గమ్యానికి చేర్చారు. మూడో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఏకపక్షంగా మలిచారు. ఈ విజయంతో న్యూజిలాండ్ సూపర్ 8 దశకు అర్హత సాధించింది.




# రంజీ సెమీస్‌లో అదరగొట్టిన షమీ

రంజీ ట్రోఫీ సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత పేసర్ మహ్మద్ షమీ అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలిచాడు. గాయాలతో కొంతకాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న షమీ, దేశీయ వేదికపై తన పాత పదును చూపించాడు. జమ్మూ అండ్ కాశ్మీర్ పై జరిగిన ఈ కీలక పోరులో షమీ 22.1 ఓవర్లలో 90 పరుగులు మాత్రమే ఇచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. ఇది ఆయన ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లోనే అత్యుత్తమ గణాంకంగా నిలిచింది. ప్రత్యర్థి జట్టులో నిలదొక్కుకున్న బ్యాటర్లను వరుసగా ఔట్ చేస్తూ 302 పరుగులకు కట్టడి చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు. దీంతో బెంగాల్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 26 పరుగుల ఆధిక్యం లభించింది. ఈ సీజన్‌లో షమీ ప్రదర్శన గమనార్హం. ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్‌ల్లో భారీ సంఖ్యలో వికెట్లు సాధించి మంచి ఫామ్‌లో ఉన్నాడు. రాబోయే అంతర్జాతీయ సిరీస్‌ల దృష్ట్యా ఈ ప్రదర్శన టీమిండియాకు శుభవార్తగా మారింది. షమీ మళ్లీ భారత టెస్టు జట్టులోకి రావడానికి సిద్ధమై ఉన్నాడనే సంకేతాలు కనిపిస్తున్నాయి.



# టీ20 వరల్డ్‌కప్‌లో 19 ఏళ్ల సమ్రా సెన్సేషన్ సెంచరీ

టీ20 వరల్‌డ్‌కప్‌లో కెనడా యువ బ్యాటర్ యువరాజ్ సమ్రా అరుదైన రికార్డు నెలకొల్పాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 65 బంతుల్లో 110 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. 58 బంతుల్లోనే శతకం పూర్తి చేసి ఐసీసీ టీ20 వరల్‌డ్‌కప్ చరిత్రలో అతి పిన్న వయసులో సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన కెనడా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు సాధించింది. సమ్రా తొలి దశలోనే దూకుడుగా ఆడి 36 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పేరుగాంచిన కివీస్ బౌలర్లను ధైర్యంగా ఎదుర్కొని తన ప్రతిభను చాటుకున్నాడు.ఈ రికార్డు ఇంతకుముందు అహ్మద్ షెహ్జాద్ పేరిట ఉండేది. ఆయన 22 ఏళ్ల వయసులో శతకం సాధించాడు. మాజీ భారత క్రికెటర్ యువరాజ్ సింగ్పై అభిమానంతో సమ్రాకు ఆ పేరు పెట్టినట్లు సమాచారం. ఇటీవల ఇతర టోర్నీల్లో కూడా వేగవంతమైన ఇన్నింగ్స్‌లు ఆడిన సమ్రా, ఈ సెంచరీతో అంతర్జాతీయ వేదికపై తన ముద్ర వేశాడు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
18.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






## పెద్ది సంగీతం...రామాయణ ప్రభావం?

దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రానికి షెడ్యూల్ పరంగా ఒత్తిడి కొనసాగుతోంది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 30కు విడుదల వాయిదా పడినప్పటికీ, నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం కీలక భాగాల చిత్రీకరణ జరుగుతుండగా, ప్రత్యేక గీతం చిత్రీకరణ కూడా త్వరలో పూర్తికానుంది. ఆ పాటలో మృణాల్ ఠాకూర్ నటిస్తారనే ప్రచారం ఉన్నా అధికారిక ధృవీకరణ లేదు. ఈ సినిమాపై ప్రధాన చర్చ సంగీతం గురించే. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తుండటంతో అంచనాలు పెరిగాయి. ఇదే సమయంలో భారీ బడ్జెట్ తో రూపొందుతున్న బాలీవుడ్ చిత్రం రామాయణకూ రెహమానే సంగీతం అందిస్తున్నారు. ఆ చిత్రానికి సంబంధించిన మ్యూజిక్ ఈవెంట్ ఏర్పాట్లు జరుగుతుండటంతో ఆయన షెడ్యూల్ మరింత బిజీగా మారింది. దర్శకుడు నితీశ్ తివారి ముందుగానే పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగవంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' రీరికార్డింగ్ పనులు కూడా సమాంతరంగా కొనసాగించాల్సి ఉంది. ఇప్పటికే ఫస్ట్ హాఫ్ పనులు పూర్తయ్యాయని సమాచారం. క్లైమాక్స్, ప్రత్యేక గీతం తర్వాత మిగిలిన భాగానికి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇవ్వాల్సి ఉంది. తక్కువ సమయంలో రెండు పెద్ద ప్రాజెక్టులను సమన్వయం చేయాల్సిన పరిస్థితి రెహమాన్ ముందుంది. దీంతో బుచ్చిబాబు తరచూ చెన్నై వెళ్లి సంగీత పనులపై సమీక్షలు చేస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ అంచనాల మధ్య 'పెద్ది'కి సంగీతం ఎంతగా ప్లస్ అవుతుందో చూడాలి.



## చీరలో మెరిసిన మానస...

**'కపుల్ ఫ్రెండ్లీ' ప్రమోషన్స్‌లో ప్రత్యేక ఆకర్షణ**

యువ నటి మానస వారణాసి తాజాగా తన కొత్త సినిమా కపుల్ ఫ్రెండ్లీ ప్రమోషన్స్‌లో భాగంగా పంచుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ ఊదా రంగు చీరలో మెరిసిన ఆమె లుక్ అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. అందమైన ఎంబ్రాయిడరీతో అలంకరించిన పర్పుల్ చీరలో మానస ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించారు. సింపుల్ జ్యువెలరీ, మృదువైన మేకప్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయ్యింది. చిరునవ్వుతో కెమెరాకు పోజులిచ్చిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సినిమా మంచి స్పందన అందుకుంటున్న నేపథ్యంలో మానస ప్రమోషనల్ స్టైల్ కూడా చర్చనీయాంశంగా మారింది. సంప్రదాయ దుస్తుల్లో ఆమె చూపిన అందం, నాజూకైన హావభావాలు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. 'కపుల్ ఫ్రెండ్లీ' విజయవంతంగా ప్రదర్శితమవుతుండగా, ఈ ప్రమోషన్స్‌తో మానసకు తెలుగు చిత్ర పరిశ్రమలో మరింత గుర్తింపు లభిస్తున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## వరుస రిలీజ్‌లతో శ్రీవిష్ణుకు సవాల్

ఇమేజ్ ఉన్న హీరోల రెండు సినిమాలు ఒకే రోజు గ్యాప్‌తో విడుదల కావడం అరుదైన విషయం. గతంలో నందమూరి బాలకృష్ణ, నాని ఇలా ఎదుర్కొన్నా, అప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడు ఓటిటి ప్రభావం, అడ్వాన్స్ అయిన ఆడియన్స్ వల్ల నిర్ణయాలు కఠినంగా మారాయి.ఈ పరిస్థితుల్లో శ్రీవిష్ణు ఫిబ్రవరి 27, 28న 'మృత్యుంజయ్', 'విష్ణు విన్యాసం'తో వరుసగా రానున్నారు. ఓటిటి ఒప్పందాల కారణంగా తేదీలు మార్చే వీలు లేకపోయినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి బాక్సాఫీస్ నెమ్మదిగా ఉన్న వేళ, ఈ రెండు సినిమాల ప్రమోషన్‌ను సమంగా నిర్వహించడం శ్రీవిష్ణుకు ప్రధాన పరీక్షగా మారింది. భిన్న జానర్లు కావడం మాత్రమే కొంత ఊరట.





## మెగాస్టార్ రిటైర్మెంట్‌పై వదంతులు

**సినిమాలు మానేస్తే ఉండేది అక్కడే!**

తెలుగు చిత్రసీమలో చెరగని ముద్ర వేసిన హీరోల్లో చిరంజీవి ఒకరు. దశాబ్దాలుగా అగ్రహీరోగా కొనసాగుతున్న ఆయన, ప్రస్తుతం కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నారు. ఈ సంక్రాంతికి విడుదలైన ఆయన చిత్రం ప్రేక్షకాదరణ పొందగా, తదుపరి ప్రాజెక్ట్‌ను దర్శకుడు బాబీతో చేయడానికి సిద్ధమయ్యారు. సినిమానే తన జీవితం అని పలుమార్లు వెల్లడించిన చిరంజీవి, రిటైర్మెంట్ అనంతరం విశాఖపట్నంలో స్థిరపడాలనే ఆలోచనను గతంలో వ్యక్తం చేశారు. సముద్రతీర వాతావరణం తనకు ఇష్టమని, అక్కడి ప్రజలతో మమేకమవడం ఆనందంగా ఉంటుందని చెప్పిన సందర్భాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఆయన రిటైర్మెంట్‌కు దూరంగానే ఉన్నట్టు కనిపిస్తోంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన, కొత్త కథలతో మరోసారి తన సత్తా చాటాలని చూస్తున్నారు. అందువల్ల సమీప భవిష్యత్తులో సినిమాలకు వీడ్కోలు పలికే సూచనలు లేవు. ఒకవేళ ఆ నిర్ణయం తీసుకుంటే మాత్రం విశాఖపట్నంలో ప్రశాంత జీవితం గడపాలని భావిస్తున్నట్టు సినీ వర్గాల సమాచారం.

## 'ది కేరళ స్టోరీ 2' ట్రైలర్ విడుదల

**మరో వివాదాస్పద కథకు సిద్ధం**

వివాదాలు, విమర్శల మధ్య విడుదలై వాణిజ్యపరంగా విజయాన్ని అందుకున్న ది కేరళ స్టోరీ చిత్రానికి కొనసాగింపుగా 'ది కేరళ స్టోరీ 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సీక్వెల్‌కు కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించారు. చిత్రీకరణ పూర్తయిన నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. మొదటి భాగం మాదిరిగానే ఈ సారి కూడా సున్నితమైన అంశాలను ప్రస్తావించినట్లు ట్రైలర్ సంకేతాలు ఇస్తోంది. సమాజంలో దాగి ఉన్న చీకటి కోణాలను మరింత గాఢంగా చూపించే ప్రయత్నం చేసినట్లు చిత్రబృందం పేర్కొంటోంది. కథనంలో థ్రిల్లింగ్ అంశాలతో పాటు భావోద్వేగాలను మేళవించినట్టు తెలుస్తోంది. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా ఆధ్వర్యంలో రూపొందిన ఈ చిత్రానికి చిత్రీకరణ సమయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. సున్నిత అంశాల కారణంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. మొదటి భాగం చుట్టూ నెలకొన్న చర్చల నేపథ్యంలో సీక్వెల్‌పై కూడా ఆసక్తి పెరిగింది. విడుదల తర్వాత ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి.






## ఒకే కారులో విజయ్ దేవరకొండ – రష్మిక..

**ఫొటోలు, పెళ్లి వార్తలపై హాట్ టాపిక్**

టాలీవుడ్ స్టార్‌లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరోసారి వార్తల్లో నిలిచారు. ముంబైలో ఈ ఇద్దరూ ఒకే కారులో కలిసి ప్రయాణం చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే వీరి పెళ్లి గురించి పుకార్లు జోరుగా వినిపిస్తున్న సమయంలో ఈ ఫోటోలు మరింత చర్చకు దారి తీశాయి. ఈ నెల 26న ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరుగుతుందనే వార్తలు ప్రచారంలో ఉన్నప్పటికీ, ఈ విషయంపై ఇద్దరూ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల ముంబై ఎయిర్‌పోర్ట్‌లో రష్మికను మీడియా పెళ్లి గురించి అడగగా, "ఏం శుభాకాంక్షలు?" అంటూ స్పందించడం కూడా ఆసక్తికరంగా మారింది. అయితే తాజాగా బయటకు వచ్చిన ఫోటోలతో నెటిజెన్స్ మళ్లీ స్పందిస్తున్నారు. "పెళ్లి వార్తలు నిజమేనా?", "ఎందుకు రహస్యంగా ఉంచుతున్నారు?" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే, విజయ్ దేవరకొండ ప్రస్తుతం కొన్ని కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, రష్మిక మాత్రం వరుస హిట్స్‌తో ఫుల్ ఫామ్‌లో కొనసాగుతోంది. వీరి పెళ్లి వార్తలపై స్పష్టత రావాల్సి ఉంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com